ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల
ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ
పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో
ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

వరంగల్ : fb.com/vaartha Digital

Published from Warangal, Karimnagar, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

16-3-2025 ఆదివారం సంపుటి: 31 సంచిక: 43 పేజీలు: 8+16 వెల: 8.00

## 214 మంది పాక్ సైనికులను చంపేశాం: బిఎల్ఎ

## జమ్ము-కాశ్మీర్‌లోనూ మహిళలకు ఉచిత బస్సు 5

## కెసిఆర్ మరో 30 యేళ్లు ప్రతిపక్షంలో ఉండాలి

### సిఎం కుర్చీ కోసం ఔరంగజేబులా వ్యవహరించింది ఆ కుటుంబ సభ్యులే

### రాష్ట్రం కోసం కాంగ్రెస్ ఎంతో చేసింది.. ఇంకా చేస్తుంది: అసెంబ్లీలో సిఎం రేవంత్

**హైదరాబాద్, మార్చి 15, ప్రభాతవార్త:** గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై శాసనమండలిలో శనివారం చర్చ ముగియగా.. సాయంత్రం తీర్మానంపై సమాధానం ఇవ్వడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మండలికి హాజరయ్యారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ సభ్యులు ఆందోళన నిర్వహించి.. సభ నుంచి వాకౌట్ చేశారు. బిఆర్ఎస్ సభ్యుల వాకౌట్ అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శాసనమండలిలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై సమాధానమిచ్చారు. తాను మాజీ ముఖ్యమంత్రి, బిఆర్ఎస్ అధినేతపై ఎటువంటి వ్యాఖ్యలు >>2



శనివారం అసెంబ్లీలో ప్రసంగిస్తున్న సిఎం రేవంత్

## 32 కాదు.. 300 సార్లు

# ఢిల్లీ వెళ్తా

### తన పర్యటనలపై జవాబిచ్చిన సిఎం రేవంత్

రాష్ట్రానికి ప్రయోజనం కోసమే నా ఢిల్లీ పర్యటనలు

ప్రధాని అన్ని రాష్ట్రాలకు పెద్దన్న

కెసిఆర్ హయాంలో అన్నీ అప్పులు, తప్పులే

డ్రగ్స్ నిరోధానికి త్వరలో ప్రత్యేక చట్టం

సోషల్ మీడియాలో హద్దు మీరితే సహించను

అసెంబ్లీలో గవర్నర్ ధన్యవాద ప్రసంగంలో సిఎం రేవంత్

**హైదరాబాద్,మార్చి 15, ప్రభాతవార్త:** ఢిల్లీ పర్యటన పేరుతో ఎలాంటి దుబారా చేయడం లేదని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. శనివారం అసెంబ్లిలో గవర్నర్ స్పీచ్‌కు ధన్యావాదాలు తెలుపుతూ ఆయన సుదీర్ఘ ప్రసంగం చేశారు. గత 15 నెలల కాలంలో తాను 32 సార్లు ఢిల్లీకి వెళ్లానని.. అవసరం అయితే 300 సార్లు వెళ్తానని ఫైర్ అయ్యారు. కేంద్ర ప్రభుత్వంతో రాష్ట్ర ప్రభుత్వం సత్సంబంధాలు కొనసాగించాలని.. దేశ ప్రధాని ఏ రాష్ట్రానికికైనా పెద్దన్న లాంటి వారేనని అన్నారు. అందులో రాజకీయం ఏముందన్నారు. ప్రధాని నరేంద్రమోదీ రాష్ట్రాల సీఎంలకు పెద్దన్న లాంటివారని.. ఆయన్ను తాను కలవడంలో రాజకీయం ఏముందని ప్రశ్నించారు. ప్రధాని, కేంద్ర మంత్రివర్గం నిర్ణయాలు రాష్ట్రాల అభివృద్ధికి >>2

## సిఎం ప్రసంగాన్ని బహిష్కరించిన బిఆర్ఎస్..

### అసెంబ్లీ నుంచి వాకౌట్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి15:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రసంగాన్ని బీఆర్ఎస్ పార్టీ బహిష్కరించింది. గవర్నర్ ప్రసంగానికి ధన్యావా దాలు తెలిపే తీర్మానంపై సీఎం సమాధానం ఇస్తుండగా బీఆర్ఎస్ సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చావును కోరుకున్న నాయకుడి ప్రసంగాన్ని తాము బహిష్కరిస్తున్నామని వాకౌట్‌కు ముందు ప్రకటించారు. బీఆర్ఎస్ పార్టీ స్ట్రెచర్ మీది నుంచి మార్చురీకే అని వ్యాఖ్యానించడం, తెలంగాణ రాష్ట్ర సాధకుడు, 10 ఏండ్లు రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపిన పాలనాదక్షుడు అయిన కేసీఆర్ చావును కోరుకోవడం అంటే.. తెలంగాణకు కీడును కోరుకోవడమే అని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఆగ్రహం వ్యక్తం చేశారు. అందుకు నిరసనగా తాము సీఎం ప్రసంగాన్ని బహిష్కరిస్తున్నామని చెప్పారు.

## సిఎం క్షమాపణ చెప్పాలని డిమాండ్ 2

## కెసిఆర్ సభకు రెండు సార్లు హాజరై రూ. 57 లక్షల జీతం తీసుకున్నారు 7

## రెండోసారి నేనే సిఎం అవుతా.. 2

# ప్రతి రైతుకు రుణమాఫీ చేశాం



### ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాం

### 12 మంది విసిలను నియమించాం

### బిఆర్ఎస్ తప్పుడు ప్రచారం మానుకోవాలి: అసెంబ్లీలో డి.సిఎం భట్టి


**హైదరాబాద్, మార్చి 15 ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యాప్తంగా ఇచ్చిన మాట మేరకు ప్రతి రైతుకు రుణమాఫీ చేశామని డిప్యూటి సిఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఇవాళ అసెంబ్లీ గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చ సందర్భంగా భట్టి విక్రమార్క మట్లాడుతూ రుణ మాఫీ విషయంలో ప్రతిపక్ష బిఆర్ఎస్ దుష్ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. ఏ జిల్లాలో ఎంత రుణ మాఫీ చేశామో లెక్కలతో సహా ఇస్తామని ఛాలెంజ్ విసిరారు. ఎవరెవరికి రుణమాఫీ అయిందో.. ఆయా గ్రామ పంచాయతీల వద్ద జాబితాను ప్రదర్శించామని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చిన కేవలం 3 నెలల్లోనే రూ.2 లక్షల రుణమాఫీ చేసి చూపించామని తెలిపారు. తాము అమలు చేస్తున్న ప్రతి పథకానికి సంబంధించి లెక్కలతో సహా చెప్పేందుకు సిద్ధంగా ఉన్నామని అన్నారు. ముఖ్యగా గజ్వేల్, సిరిసిల్ల, సిద్దిపేట్‌లకు బిఆర్ఎస్ కంటే ఎక్కువ మేలు చేశామని తెలిపారు. గృహజ్యోతి పథకం కింద రూ.కోట్లు చెల్లిస్తున్నామని అన్నారు. ఇక్క సిద్దిపేటలోనే ఆ పథకం కింద రూ. 20.37 కోట్లు, సిరిసిల్లకు రూ.25 కోట్లు చెల్లించామని స్టేట్‌మెంట్లను చూపారు. టిఆర్ఎస్ శాసనసభ్యులు పల్లా రాజేశ్వర్ రెడ్డి ప్రశ్నలకు ఘాటుగా సమాధానం ఇచ్చారు. టిఆర్ఎస్ నేతలు మాట్లాడితే తప్పుడు సమాచారం ఇస్తున్నారు మీలాగా ఆరు సంవత్సరాలు పెండింగ్‌లో పెట్టకుండా మేము మూడు నెలల్లోనే రైతు రుణమాఫీ చేశాం. పల్లా రాజేశ్వర్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న జనగామ నియోజకవర్గంలో 2018లో టిఆర్ఎస్ హయాంలో ఐదు సంవత్సరాల్లో 124 కోట్లు రుణమాఫీ చేస్తే.. మా కాంగ్రెస్ ప్రభుత్వం మూడు నెలల్లోనే రూ.263 కోట్లు రుణమాఫీ చేసిందన్నారు. గజ్వేల్ లో 2018 లో 104.3 కోట్ల రుణమాఫీ చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వం, గజ్వేల్‌లో 237.33 కోట్ల రుణమాఫి చేసిందన్నారు. 2018లో సిద్ధిపేటలో బిఆర్ఎస్ ప్రభుత్వం చేసిన రైతు రుణమాఫీ 96.62 కోట్లు అన్నారు. సిద్దిపేటలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన రుణమాఫీ 177.91 కోట్లు అని, సిరిసిల్ల నియోజకవర్గంలో, 2018లో 101.76 కోట్ల రుణమాఫీ చేసిన బిఆర్ఎస్ సిరిసిల్లలో రూ. 175.84 కోట్ల రుణమాఫీ చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం అన్నారు. శాసనసభ ప్రాంగణంలోనూ రైతు రుణమాఫీ, రైతు భరోసా కు సంబంధించిన సమాచారం డిస్‌ప్లే చేస్తామన్నారు. ప్రతి సంక్షేమ పథకం వివరాలు లెక్కలతో సహా ఎమ్మెల్యేలకు ఇస్తామని, గ్రామాల వారీగా ఫ్లెక్సీలపై డిస్‌ప్లే చేశామన్నారు. రైతు రుణమాఫీ మాత్రమే కాదు, సన్నాలకు బోనస్, మహిళలకు ఉచిత బస్సు, 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటు ప్రతి స్కీంకు సంబంధించిన వివరాలు లెక్కలతో సహాఇస్తామని వివరించారు. మీలాగా పనులు చేయకుండా మేము ప్రచారం చేసుకోలేదని, రాష్ట్రంలోని యూనివర్సిటీలను గాలికి వదిలేస్తే మేము 12 మంది >>2

# 64 మంది నక్సల్స్ లొంగుబాటు

### మావోయిస్టులు కాలం చెల్లిన సిద్ధాంతాలు వదిలి జన జీవన స్రవంతిలోకి రావాలి: ఐజిపి చంద్రశేఖర్ రెడ్డి

**కొత్తగూడెం క్రైమ్ మార్చి 15, ప్రభాతవార్త:** నిషేధిత సిపిఐ మావోయిస్టు పార్టీలో ఉన్న వారంతా కాలం చెల్లిన సిద్ధాంతాలను వీడి జనజీవన స్రవంతిలో కలవాలని మల్టీ జోన్ 1 ఐ.జి.పి చంద్రశేఖర్ రెడ్డి పిలుపునిచ్చారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం హేమచంద్రాపురం పోలీస్ హెడ్ క్వార్టర్స్ లో 64 మంది మావోయిస్టులు సరెండర్ మేళాకు మల్టీ జోన్ 1 ఐ.జి.పి చంద్రశేఖర్ రెడ్డి హాజరయ్యారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్, సీఆర్పీఎఫ్ అధికారులురితేష్ ఠాకూర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మల్టీ జోన్ ఐ జి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ... ఈరోజు పోలీసులకు సిఆర్పిఎఫ్ అధికారులకు ఓ మంచి రోజు అని అన్నారు. మావోయిస్టు పార్టీని, సిద్ధాంతాలను వీడి చతిస్గఢ్ బీజాపూర్ జిల్లాకు చెందిన 64 మంది మావోయిస్టులు భద్రాద్రి జిల్లా పోలీస్ ఎదుట సరెండర్ అయ్యారన్నారు. సరెండర్ అయిన వారిలో 48 మంది పురుషులు, 16 మంది మహిళలు..మొత్తం 64 మంది ఉన్నారు. జన జీవన స్రవంతిలో కలుస్తున్న వారికి జిల్లా పోలీసులకు సిఆర్పిఎఫ్ >>2



## 41 దేశాలపై అమెరికా ట్రావెల్ బ్యాన్!

### ఆయా దేశాలు మూడు కేటగిరీలుగా ఎంపిక

**వాషింగ్టన్, మార్చి 15:** ఉద్యోగాల్లో కోతలు, ప్రపంచదేశాలపై ప్రతీకార సుంకాలతో దూకుడుగా వ్యవహరిస్తున్న డొనాల్డ్‌ట్రంప్ కొత్తగా మరో సంచలన నిర్ణయం తీసుకన్నారు. పదులకొద్దీ దేశాలపై ట్రావెల్‌బ్యాన్ విధించాలనినిర్ణయించారు. ఇదే విషయమై ఆయన సర్కారు యంత్రాంగం సమగ్రపరిశీలనచేస్తోంది. 41 దేశాలపై ఈ ట్రావెల్ బ్యాన్ విధించాలని కొన్నింటిపై ఆంక్షలు పెంచాలని ట్రంప్ యోచనగా ఉంది. ఇందు కోసం ముందుగా ఒక అంతర్గత మెమో ఒకటి బయటికి లీక్ అయింది. మొత్తం 41 దేశాలను మూడు గ్రూపులుగా విభజించారు. పదిదేశాలతో ఉన్న మొదటిగ్రూప్‌లో ఆఫ్ఘనిస్తాన్, ఇరాన్, సిరియా, క్యూబా, ఉత్తర కొరియా దేశాలున్నాయి. ఈ దేశాలపౌరులకు వీసాలుపూర్తిగా నిలిపివేస్తారు. ఇక రెండో గ్రూప్‌లో ఎరిత్రియా, హైతీ, లావోస్, మైన్మార్, దక్షిణసూడాన్ దేశాలున్నాయి. వీటిపై పాక్షిక ఆంక్షలు అమలుచేయనున్నారని ఆమెమోలో పేర్కొన్నారు. ఈదేశాలకు పర్యాటక, విద్యార్థి వీసాల వంటివిజారీ చేయకూడదని >>2

## ఎయిర్‌పోర్టు తరహాలో

# బేగంపేట స్టేషన్

### రైల్వేలో విప్లవాత్మక మార్పులు : కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్ (బేగంపేట) మార్చి 15,ప్రభాతవార్త:** అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం వివిధ రైల్వేస్టేషన్లను అభివృద్ధి చేస్తోందని కేంద్ర మంత్రి గంగాపురం కిషన్ రెడ్డి అన్నారు. శనివారం రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్‌తో కలసి బేగంపేట రైల్వేస్టేషన్ ను కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైల్వేలో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయని కిషన్ రెడ్డి అన్నారు. త్వరలోనే బేగంపేట రైల్వేస్టేషన్‌ను ప్రారంభిస్తామని తెలిపారు. మరో 10శాతం పనులు పూర్తి కావాల్సి ఉందని, విమానాశ్రయాల తరహాలో రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేస్తున్నామన్నారు. అమృత్ భారత్ స్టేషన్ పథకం రూ26.55కోట్లతో మొదటి విడత పనులు జరుగుతున్నాయని ,మరో రూ 12కోట్లతో రెండో విడత పనులు పూర్తి చేస్తామని కిషన్ రెడ్డి అన్నారు. ప్రయాణీకులకు ఇబ్బంది లేకుండా దశల వారీగా అభివృద్ధి పనులు పూర్తి చేస్తున్నామని తెలిపారు. ఒకప్పుడు రైల్వేస్టేషన్ కు వస్తే ముక్కుమూసుకుని రావాల్సిన పరిస్థితి ఉండేదని, ప్రధాని నరేంద్రమోదీ స్వచ్ఛ భారత్ ద్వారా స్వచ్ఛ రైల్వేస్టేషన్ పేరుతో వినూత్న మార్పులను తీసుకొచ్చారని గుర్తు చేసారు. చర్లపల్లి రైల్వేస్టేషన్ ని కూడా అథునాతనంగా నిర్మించుకొని ప్రారంభించుకున్నామని బేగంపేట రైల్వేస్టేషన్‌లో అందరూ మహిళా ఉద్యోగులు ఉండేలా చూస్తామని అన్నారు. బేగంపేట రైల్వేస్టేషన్‌ను విమానాశ్రయాల తరహాలో రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేస్తున్నామని, రైల్వేలో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. తెలంగాణా రైల్వేల సమగ్రాభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉందని అన్నారు. ఇందుకోసం ప్రజలు ప్రభుత్వం కూడా సహకరించాలని విజ్ఞప్తి చేసారు. అన్ని రైల్వేస్టేషన్లలో ఉచిత వైఫై సౌకర్యం కల్పించనున్నామని స్పష్టం చేసారు. బేగంపేట, చర్లపల్లి, మేడ్చల్, యాకత్‌పురా, నాంపల్లి, >>2



శనివారం హైదరాబాద్‌లోని బేగంపేట రైల్వే స్టేషన్‌ను పరిశీలిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



శనివారం గోలాఘాట్‌లో లచిత్ బర్ఫుకాన్ పోలీస్ అకాడమీ ప్రారంభోత్సవంలో పాల్గొన్న కేంద్ర హోం మంత్రి అమిత్ షా. అసోం సిఎం హిమంత బిశ్వ శర్మ

# బిఆర్ఎస్‌ను మార్చురీకి పంపాలన్నా.. కెసిఆర్‌ను కాదు

## ఆయన వందేళ్లు ఆరోగ్యంగా.. ప్రతిపక్షంలో ఉండాలి: సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మార్చి15:** బిఆర్ఎస్‌ను మార్చురీకి పంపారని అన్నానే తప్ప కెసిఆర్‌ను కాదు, తాను అనని మాటలు అన్నట్టు కేటీఆర్, హరీశ్ రావు ప్రచారం చేస్తున్నారని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి తెలిపారు. పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని ప్రజలు మార్చురీకి పంపారని అన్నానని, అయితే కెసిఆర్‌ను మార్చురీకి పంపాలని అన్నట్లు బిఆర్ఎస్ నేతలు నోటికొచ్చినట్లు ఆరోపణలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. బిఆర్ఎస్ నాయకులు మాట్లాడితే స్టేచర్ స్టేచర్ అంటున్నారని చెబుతూ రేవంత్‌రెడ్డి గట్టి కౌంటర్ ఇచ్చారు. నాకు మీ స్టేచర్ కన్నా తెలంగాణ ఫ్యూచర్ ముఖ్యమని అన్నారు. ఆనాడు అధికార పార్టీగా బిఆర్ఎస్‌కు స్టేచర్ ఉండేది. 2023 డిసెంబర్‌లో ప్రధాన ప్రతిపక్ష పార్టీగా స్టేచర్ ఇచ్చారు. 2024 పార్లమెంట్ ఎన్నికల్లో గుండుసున్నా ఇచ్చి మార్చురీకి పంపించారు. బిఆర్ఎస్ నేడు మార్చురీలో ఉందని చెప్పాను.. అందులో తప్పేముంది. బిఆర్ఎస్ మార్చురీలో ఉందని నేను చెబితే.. పెద్దాయన కెసిఆర్‌ను నేను అన్నట్లుగా కెటిఆర్, హరీశ్‌రావు చిత్రీకరించారు. అంత కుంచిత స్వభావం నాకు లేదు. చంద్రశేఖర్‌రావు వద్ద ఉన్న కుర్చీని 4 కోట్ల మంది తెలంగాణ ప్రజలు గుంజుకొని నన్ను కూర్చోబెట్టారు. చంద్రశేఖర్‌రావు వద్ద తీసుకోవడానికి ఇంకేముంది. వారి వద్ద ఉన్నది ప్రధాన ప్రతిపక్ష హోదా.. ఆ హోదా కెటిఆర్ లేదా హరీశ్‌రావుకు కావాలి. అది వారి సమస్య, తప్పుడు మాటలు నాకు ఆపాదిస్తున్నారు. నేను ఆలా కోరుకోవడం లేదు. కెసిఆర్.. వందేళ్ల ఆయురారోగ్యాలతో ప్రతిపక్షంలోనే ఉండాలి.. నేను ఇక్కడనే (అధికారంలో) ఉండాలి. చంద్రశేఖర్‌రావు సూచనలు చేస్తూనే ఉండాలి నేను మంచి పరిపాలన అందిస్తూనే ఉండాలి అని రేవంత్ తన ప్రసంగంలో పేర్కొన్నారు. రాష్ట్రంలో పంటలు ఎండినా, ఎవరైనా చచ్చిపోయినా తండ్రి, కొడుకు, మామా అల్లుండ్లు కలిసి డ్యాన్సులు చేస్తున్నారని ధ్వజమెత్తారు. బిఆర్ఎస్ నేతల కళ్లలో పైశాచిక ఆనందం కనిపిస్తోందని విమర్శించారు. ఎన్నికల్లో ఓడిపోతే ప్రజలే తప్పు చేశారన్నట్టు బిఆర్ఎస్ నేతలు ప్రచారం చేయడాన్ని రేవంత్‌రెడ్డి ప్రస్తావిస్తూ ప్రజలు కూడా 2022 నుంచి తమ నిరసన వివిధ రూపాల్లో తెలుపుతూనే ఉన్నారని, వీళ్ల ఆగడాలు తగ్గలేదని గుర్తించే తమకు అధికారం కట్టబెట్టారని పేర్కొన్నారు.

## మరో 30 యేళ్లు ప్రతిపక్షంలో ఉండాలి

>> చేయలేదని .. తాను బిఆర్ఎస్ పార్టీ ప్రస్తుత పరిస్థితిపై వ్యాఖ్యానించానని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రంలో 2023 డిసెంబర్ 3 అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడే కంటే ముందు వరకు బిఆర్ఎస్ అధికారంలో ఉన్నదని.. మంచి స్టేచర్‌లో ఉన్నదని చెప్పానని అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం స్ట్రెచ్చర్‌పైకి వెళ్లిందని చెప్పానని అన్నారు. ఆ తరువాత 2024లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో ఒక్క సీటు కూడా గెలవకుండా గుండుసున్నా రావడంతో.. అదికాస్త స్ట్రెచ్చర్ నుంచి మార్చురీ మారిందని చెప్పానని.. తాను అన్న మాటలకు ఇప్పటికీ కట్టుబడి ఉన్నానని.. వాటిలో తప్పేముందని ప్రశ్నించారు. తాను అన్న మాటలను బిఆర్ఎస్ నేతలు ఆ పార్టీ నేతకి ఆపాధించుకున్నారని మండిపడ్డారు. కెసిఆర్ నిండు నూరేళ్లు ఉండాలని తాను కోరుకుంటున్నానని స్పష్టం చేశారు. కెసిఆర్ నూరేళ్లు ఉండాలని.. మొన్ననే 71 సంవత్సరాలు పూర్తి చేసుకున్నారని.. మరో 30 ఏళ్లకూడా ఆయన ప్రతిపక్షంలో ఉండాలని కోరుకుంటున్నట్టు తెలిపారు. ఆయన ప్రతిపక్షంలో ఉండాలని.. తాను ప్రజలకు మంచిపనులు చేసుకుంటూ ప్రజాసేవలో కొనసాగాలని కోరుకుంటున్నట్టు తెలిపారు. తాను ఎన్నికల్లో పోటీ చేసి తమ పార్టీ గెలవడంతో.. రాష్ట్రంలోని ప్రజలు బిఆర్ఎస్, కెసిఆర్ వద్దని.. మార్పు రావాలని.. మార్పు కావాలని.. కాంగ్రెస్ రావాలని కోరుకున్నారు కాబట్టి తాము గెలిచామని.. తాను ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టానని తెలిపారు. కెసిఆర్ ప్రస్తుతం ప్రతిపక్షంలో ఉన్నారని.. ఆయన కుర్చీ కోసం తానెందుకు తాపత్రయ పడతానని ప్రశ్నించారు. కెసిఆర్ ప్రస్తుతం ఉన్న ప్రతిపక్ష కుర్చీ కోసం ఆయన కుటుంబంలోనే నలుగురు వ్యక్తులు ఎదురు చూస్తున్నారని.. వారిలో ఎవరో ఒకరు కుర్చీకోసం పోటీపడతారు తప్ప.. తానెందుకు ఆ కుర్చీకోసం వెంపర్లాడుతానని అన్నారు. కెసిఆర్ ముఖ్యమంత్రిగా కొనసాగిన సమయంలోనే ఆయన దిగిపోయి ఆయన కొడుకు కేటిఆర్ సిఎం అవుతున్నాడని.. అప్పట్లో బిఆర్ఎస్ నేతలే బహిరంగంగా చెప్పినట్టు వార్తలు వచ్చాయని సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. తండ్రి బ్రతికి ఉండగానే.. ఆయన ముఖ్యమంత్రి కుర్చీ కోసం ఔరంగజేబులాగా ఆయన కుటుంబ సభ్యులే వ్యవహారించారని గుర్తు చేశారు. కానీ తానెప్పుడు కెసిఆర్ కుర్చీ కోసం తాపత్రయ పడలేదని స్పష్టం చేశారు. తాను ఎన్నికల్లో పోటీచేసి గెలిచి పదవిలోకి రావాలని చూస్తానని స్పష్టం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 14 నెలల్లోనే రాష్ట్ర ప్రజలకు తామిచ్చిన హామీలను అమలు చేశామని.. ఇంకా ఎంతో చేయాల్సింది ఉందని.. రాబోయే కాలంలో వాటన్నింటినీ పూర్తి చేస్తామని చెప్పారు.

## ఎయిర్‌పోర్టు తరహాలో బేగంపేట స్టేషన్

>> కాచిగూడా, ఉందానగర్ ఇలా అనేక రైల్వేస్టేషన్ల ఆధునీకరణకు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ అంగీకరించారన్నారు. రాష్ట్రప్రభుత్వం ఆయా రైల్వేస్టేసన్లకు అప్రోచ్ రోడ్లకు స్థలాలను అందిస్తే బాగుంటుందన్నారు. కేంద్రం ఆధునీకరించబోయే రైల్వేస్టేషన్లన్నీ ఎయిర్ పోర్ట్‌ల మాదిరి అంతర్జాతీయ స్థాయిలో సౌకర్యాలు ఉండేలా చర్యలు తీసుకున్నామని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పష్టం చేసారు. శనివారం బేగంపేట రైల్వేస్టేషన్‌లో ఆధునీకరణ పనులు ఏమేరకు కొనసాగుతున్నాయనే దానిపై ఆరా తీసారు. స్టేషన్ ప్రాంగణంలో పర్యటించి పలు రకాల పనుల తీరును పర్యవేక్షిస్తూ అధికారులను అడిగి వివరాలను తెల్సుకున్నారు. కొత్త స్టేషన్ భవనం, ముఖద్వారం, ప్లాట్‌ఫాం ఉపరితల ఎత్తు పెంపు ,12మీటర్ల వెడల్పు ఉండే ఫుట్‌ఓవర్ బ్రిడ్జి ఎస్కలేటర్లు, లిఫ్ట్‌లు, బుకింగ్ కౌంటర్లు, సైనేజీలు, వెయిటింగ్‌హాలు తదితర అభివృద్ధి పనులను కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అధికారులతో కల్సి పరిశీలించారు. తెలంగాణాలో 40రైల్వేస్టేషన్లను అమృత్‌భారత్ స్టేషన్ పథకం కింద పునరాభివృద్ధి చేస్తున్నామని పనులు వేగంగా జరుగుతున్నాయని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. బేగంపేట రైల్వేస్టేషన్ ను పర్యావరణ హిత హరిత రైల్వే స్టేషన్‌గా అభివృద్ధి చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

## కృష్ణా జలాలపై తప్పుడు ప్రచారం: మంత్రి ఉత్తమ్

**హైదరాబాద్, మార్చి 15 ప్రభాతవార్త:** కృష్ణా జలాలపై బిఆర్ఎస్ తప్పుడుప్రచారం చేస్తుందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. పోతిరెడ్డిపాడు కెపాసిటీ పెరగడానికి కారణం బిఆర్ఎస్ అన్నారు. బిసి రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణ చేసి తీరుతామని ప్రశ్నించారు. ప్రగతి భవన్‌లో అప్పటటి సిఎం జగన్‌మోహన్‌రెడ్డితో విందులు, వినోదాలుచేసే సమయంలో రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పనులు మొదలు పెట్టారన్నారు. గత ప్రభుత్వం పది సంవత్సరాల నిర్లక్ష్యం వల్ల శ్రీశైలం బ్యాక్ వాటర్ నుంచి ఏపి అక్రమంగా నీటిని తీసుకెళ్లిందన్నారు. రాష్ట్రానికి అన్యాయం జరుగుతుంటే చూస్తూ కూర్చున్నారన్నారు. తమ ప్రభుత్వం వచ్చిన తరువాత గత జరిగిన అన్యాయని కేంద్రానికి వివరించి, మళ్లీ పున: పరిశీలిన చేయాలని కోరామన్నారు. అదేవిధంగా టెలిమెట్రిక్‌లను ఏర్పాటు చేయాలని కోరామని, దీని ఖర్చు చూడా తామే భరిస్తామని చెప్పినట్లు వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేయడం మానుకోవాలన్నారు. ఎస్సీ వర్గీకరణ అమలుచేస్తున్నది తమ ప్రభుత్వమే అన్నారు.

# 17న కులగణనపై అసెంబ్లీలో చర్చ: -సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి15:** ఈ నెల 17న కులగణనపై అసెంబ్లీలో చర్చ జరగనుందని, సమగ్ర సర్వేకు సంబంధించిన వివరాలన్నీ సభ ముందుంచుతామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. గవర్నర్ ప్రసంగంపై శనివారం అసెంబ్లీలో ధన్యవాద తీర్మానం చర్చకు సమాధానం ఇస్తూ ఆయన మాట్లాడారు. అప్పులపై చర్చకు సిద్ధమని, ఎన్ని అబద్దాలు చెప్పయినా కేసీఆర్ తనను ఓడించవచ్చునని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం నుంచి వచ్చిన అప్పులు, వడ్డీలు తీర్చేందుకు అప్పులు తీసుకురావాల్సి వస్తోందని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.లక్ష 58 వేల 41 కోట్లు అప్పు తెచ్చినట్లు వెల్లడించిన సీఎం, అందులో గత ప్రభుత్వం చేసిన రూ.88 వేల 591 కోట్లు, వాటిపై వడ్డీ రూ.64 వేల 768 కోట్లు తీర్చినట్లు వివరించారు. ప్రస్తుతం రాష్ట్రానికి రూ.7 లక్షల 38 వేల 707 కోట్ల అప్పులు ఉన్నాయని తెలిపారు. పారదర్శకంగా ఉంటామని, అబద్ధాలు చెప్పమన్నారు.

# తెలుగు వర్సిటీకి సురవరం పేరు

## సవరణ బిల్లు ప్రవేశపెట్టిన ప్రభుత్వం, సమావేశాలు రేపటికి వాయిదా

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి15:** తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు మూడో రోజు(శనివారం) హాట్ హాట్‌గా జరిగింది. గవర్నర్ ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై శనివారం చర్చ జరిగింది. రుణమాఫీ, బకాయిల చెల్లింపు తదితర అంశాలపై అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బిఆర్ఎస్ మధ్య పోటాపోటీగా మాటలయుద్ధం సాగింది. అనంతరం సిఎం రేవంత్‌రెడ్డి గవర్నర్ ప్రసంగ తీర్మానంపై సుదర్ఘీంగా సమాధానమిచ్చారు. తదుపరి శాసనసభలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం సవరణ బిల్లును ప్రభుత్వం ప్రవేశపెట్టింది. అనంతరం శాసన సభను సోమవారానికి వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రకటించారు. తెలుగు విశ్వవిద్యాలయం ఇక నుంచి సురవరం ప్రతాప్‌రెడ్డి విశ్వవిద్యాలయంగా మారనుంది. మండలిలో సిఎం రవేంత్ ప్రసంగం ముగించిన అనంతరం సమావేశాలు కూడా సోమవారానికి వాయిదా వేస్తున్నట్లు మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ప్రకటించారు.

## వారం - వర్జ్యం

తేది : 16-03-2025, ఆదివారం
శ్రీ క్రోధి నామ సంవత్సరం,
ఫాల్గుణమాసం, ఉత్తరాయణం,
శిశిర ఋతువు, కృష్ణపక్షం,
విదియ సా.4.59
హస్త ఉ.11.44
వర్జ్యం రా.8.45-10.33
దు.సా.4.45-5.33
రాహుకాలం - సా.4.30-6.00

## వార్తాఫలం

- **మేషం :** అనుకోని సమస్యలు ఎదురైన అధిగమించి ముందుకు సాగుతారు. శ్రమ తప్ప ఫలితం ఉండదు.
- **వృషభం:** ఆప్తులతో ఏర్పడిన విరోధాలు పరిష్కరించుకుంటారు. ప్రయాణాలలో తొందరపాటు వద్దు.
- **మిథునం:** దూరప్రాంతాల నుండి వచ్చిన ఆహ్వానాలు ఆశ్చర్యపరుస్తాయి. సేవకార్యక్రమాలలో పాల్గొంటారు.
- **కర్కాటకం:** వృత్తి, వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. పనులు సకాలంలో పూర్తి చేస్తారు.
- **సింహం:** అనుకోని విధంగా ధనలాభం పొందుతారు. బంధువులను కలిసి కష్టసుఖాలను పంచుకొంటారు.
- **కన్య :** ముఖ్యమైన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. ఆస్తివివాదాలు పరిష్కారమై నూతన ఒప్పందాలు కుదురుతాయి.
- **తుల :** సంఘంలో గౌరవం పొందుతారు. నూతన వస్తు, వస్త్రాలు కొనుగోలు చేస్తారు. విందు, వినోదాలలో పాల్గొంటారు.
- **వృశ్చికం:** ముఖ్యమైన పనులలో ఆటంకాలు ఎదురైన అధిగమిస్తారు. ఆరోగ్యం పట్ల మెలుకవ చాలా అవసరం.
- **ధనుస్సు:** కుటుంబ సమస్యల నుండి బయటపడతారు. దూరప్రాంతాల నుండి శుభవార్తలు అందుకుంటారు.
- **మకరం:** వృత్తి, వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. విందు, వినోదాలలో చురుకుగా పాల్గొంటారు.
- **కుంభం:** బంధువులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించు కుంటారు. రుణబాధలు ఎదురైన అధిగమిస్తారు.
- **మీనం :** ఆకస్మిక ప్రయాణాలలో నూతన పరిచయాలు పెరుగుతాయి. సోదరుల నుండి సాయం అందుకొంటారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# 32 కాదు.. 300 సార్లు ఢిల్లీ వెళ్తా

>> దోహదపడతాయని, అందువల్ల కేంద్రంతో సత్సంబంధాలు కొనసాగించాలన్నారు. ప్రధాన మంత్రి మోడీ దేశంలోని అన్ని రాష్ట్రాలకు పెద్ద అన్న లాంటి వాడన్న సిఎం రాష్ట్ర ప్రయోజనాల కోసమే ప్రధాని మోదీని కలిసినట్లు చెప్పారు. రాజకీయాలకు వచ్చినప్పుడు నేను కాంగ్రెస్ నేతను.. ఆయన భాజపా నాయకుడు. అవసరమైతే మహేశ్వరెడ్డిని ఢిల్లీ తీసుకెళ్తాం.. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని నాలుగు సార్లు కలిశాం. నిర్మలాసీతారామన్, అమిత్ షాలను కూడా కలిసినట్లు చెప్పారు. బిఆర్ఎస్ నాయకుల్లా తాను చీకటో ఎవరి కాళ్ళు పట్టుకోలేదని తెలిపారు. రీజనల్ రింగ్ రోడ్డుతో సహా అన్ని ప్రాజెక్టులకు అనుమతులు తీసుకు వచ్చానని సిఎం అన్నారు.

**హైదరాబాద్‌ను నాశనం చేశారు**

కమీషన్లు తీసుకొని హైదరాబాద్ నగరాన్ని సర్వనాశనం చేశారని సిఎం విమర్శించారు. చెరువులు, కుంటలు మాయం చేశారన్నారు. అపార్ట్‌మెంట్లకు తగినట్లు డ్రైనేజీ వ్యవస్థ లేకుండా పోయిందన్నారు. చెరువులు, కుంటలను పునరుద్ధరించాలని ప్రయత్నిస్తుంటే అనవసరంగా గగ్గోలు పెడుతున్నారని అసహనం వ్యక్తం చేశారు. లెక్క లేకుండా అనుమతులిచ్చి నగరంలో గందరగోళం సృష్టించారన్నారు.
ఫ్యూచర్ సిటి డెవలప్‌మెంట్ అథార్టీని ఏర్పాటు చేశామన్నారు. ప్రంచ దేశాలతో పోటీ పడేలా నగరాన్ని నిర్మించాలని చూస్తే అడ్డం పడుతున్నారని ఆరోపించారు. మాజీ సిఎం కేసిఆర్ సలహాలు, సూచనలు ఇస్తే పాటించేందుకు ఉన్నాం. అనుభవం ఉన్న వ్యక్తిగా ఆయన చెప్పినవి పాటిస్తాం అన్నారు. అప్పులు పెండింగ్‌లో పెట్టి పారిపోతే మేము కట్టుకుంటున్నామని కేసిఆర్ తన పాలనలో అప్పులు, తప్పులు చేశారని ఆయన ఆరోపించారు. ఈ 15 నెలల కాలమంతా కేసీఆర్ చేసిన అప్పులు, తప్పులు సరిచేయడానికే సరిపోయిందని, వాళ్ళు పెట్టిన అప్పులకు వడ్డీలు కట్టడమే భారంగా ఉందన్నారు. అప్పులు పెట్టింది కాకుండా తిరిగి మాపైనే విమర్శలు చేస్తున్నారన్న సిఎం డిస్కంలు, సింగరేణి, కాంట్రాక్టర్లకు బిల్లులు పెండింగ్ పెట్టి వెళ్లిపోయారని ఆరోపించారు. రూ.8 లక్షల కోట్ల అప్పులు మాపై వేసి, రూ.1.52 లక్షల కోట్లు అప్పు చేశామని మాపై బురద జల్లుతున్నారు. ప్రస్తుతం తెలంగాణ అప్పు రూ.7,38,707 కోట్లు ఉన్నాయన్నారు. తాము అబద్ధాల పునాదుల మీద ప్రభుత్వాన్ని నడపాలని అనుకోవడం లేదు. ప్రజలే మా బాసులు.. నన్ను సీఎం కుర్చీలో కూర్చోబెట్టిన ప్రజలకు నేను జవాబుదారిగా ఉండాల్సిన బాధ్యత నాపై ఉందన్నారు.'

**కులానికి స్టేచర్ ఉండదు..**

కులానికి ఎక్కడా స్టేచర్ ఉండదని.. మీకు మీరుగా స్టేచరు. ఆపాదించుకోవద్దని బీఆర్ఎస్ నేతలను ఉద్దేశించి సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. స్పీకర్‌ను బిఆర్ఎస్ నేతలు నేతలు గౌరవించడం లేదని సిఎం ఎందుకిలా బరితెగిస్తున్నారని ప్రశ్నించారు. అజ్ఞానాన్నే విజ్ఞానం అనేలా వ్యవహరిస్తున్నారని అన్నారు. కులానికి ఎక్కడా స్టేచర్ ఉండదని.. పదవికి మాత్రమే స్టేచర్ ఉంటుందని, వ్యక్తికి కూడా కాదని తెలిపారు. ఇక మీదట ఫామ్ హౌజ్‌లో డ్రగ్స్ పార్టీలను ఉపేక్షించబోమని అన్నారు. దుబాయ్‌లో ఏం జరిగిందో వివరాలు తెప్పించామంటూ నిర్మాత కేదార్ మృతికి సంబంధించి ఆయన సభలో ప్రస్తావించారు. ఆ నాయకుడు సభకు వచ్చాక అన్నీ బయటపెడతామని అన్నారు. బిఆర్ఎస్ ఇచ్చిన నోటిఫికేషన్లతోనే తాము ఉద్యోగాలు ఇచ్చామని అంటున్నారని, ప్రక్రియ మొత్తం పూర్తి చేసి ఉద్యోగాలు ఎందుకు ఇవ్వలేకపోయారని ప్రశ్నించారు. మొదటి ఏడాదిలోనే 55 వేల ఉద్యోగాలు ఇచ్చిన చరిత్ర తమ సర్కారుకే దక్కిందన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగం తగ్గిందని ఇటీవల వచ్చిన నివేదికలు చెబుతున్నాయన్నారు. రాష్ట్రంలో విద్యావ్యవస్థను పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేస్తున్నామని, అన్ని నియోజక వర్గాల్లో 100 ఇంటి గ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ళను ఏర్పాటు చేయబోతున్నట్లు చెప్పారు. కేవలం తమ ప్రభుత్వంతో నిరుపేదల పిల్లలల చదువుల కోసంప ఇవన్నీ చేస్తుందన్నారు. రూ.300 కోట్ల వ్యయంతో ఉస్మానియా ఆసుపత్రి నూతన భవనాన్ని నిర్మించబోతున్నామన్నారు.

**డ్రగ్స్ నివారణకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం**

తెలంగాణలో డ్రగ్స్, గంజాయి నివారణకు పూర్తి స్థాయి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు సీఎం రేవంత్ రెడ్డి. డ్రగ్స్ కేసులో పట్టుబడిన వారికి కరెంటు, నీళ్లు కట్ చేస్తామని స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. డ్రగ్స్ విషయంలో ఎంత పెద్ద వారున్నా వదిలిపెట్టేది లేదని అసెంబ్లీ వేదికగా ప్రకటించారు. ఫాంహౌస్ లలో డ్రగ్స్ పార్టీలపై దాడులు చేస్తున్నామని చెప్పిన సిఎం రేవంత్.. ఈ విషయంలో ఎంతటివారున్నా వదిలిపెట్టే ప్రసక్తి లేదని అన్నారు. కాలేజీల్లో గంజాయి, డ్రగ్స్ నివారణకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. డ్రగ్స్ కేసులో దొరికితే.. కరెంటు, నీళ్లు కట్ చేస్తామని హెచ్చరించారు. హైదరాబాద్ ట్రాఫిక్ కంట్రోల్ కు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు సీఎం రేవంత్. పొల్యూషన్ కంట్రోల్ చేసేందుకు మరిన్ని ఎలక్ట్రిక్ బస్సులను పెంచుతున్నట్లు ప్రకటించారు. అదే విధంగా ఎలక్ట్రిక్ ఆటోలకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు.

**ప్రజా జీవితంలో ఉన్నాం కదాని ఓపిక పడుతున్నా**

కుటుంబ సభ్యులు, ఆడబిడ్డల మీద ఇష్టం వచ్చినట్లు పోస్టులు పెడుతున్నారు అని సీఎం అన్నారు. ప్రజా జీవితంలో ఉన్నాం కదా అని ఓపిక పడుతున్నామని, లేదంటే ఒక్కడు బయట తిరగలేడని అన్నారు. అమ్మపై, చెల్లిపై ఇలాంటి పోస్టులు పెడితే ఊరుకుంటారా? అని ప్రశ్నించారు. హద్దు దాటితే ఇకపై ఊరుకోబోమని అన్నారు. జర్నలిస్టు అంటే వివరణ ఇవ్వాలని, ముసుగేసుకుని వస్తే గుడ్డలు ఊడదీసి కొడతామని, తోడ్కలు తీస్తామంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. నేను ఓపికతో ఉన్న కాదు అంటే. ఒక్కడు కూడా బయట తిరగడు అని హెచ్చరించారు. కోర్టుకు పోతే బెయిల్ వస్తది అనుకుంటున్నారు. అవసరమైతే చట్టాన్ని సవరిస్తామని సిఎం రేవంత్ రెడ్డి హెచ్చరించారు.

# రెండోసారి నేనే ముఖ్యమంత్రి అవుతా

## 2వ సారి మాపై ప్రేమతో ప్రజలు ఓటు వేస్తారు

### మీడియా ప్రతినిధులతో సిఎం రేవంత్ రెడ్డి చిట్ చాట్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మార్చి15:** రెండోసారి నేనే ముఖ్యమంత్రి అవుతానని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి తెలిపారు. మొదటిసారి బిఆర్ఎస్ పై వ్యతిరేకతతో ప్రజలు మాకు ఓటేశారని రెండోసారి మాపై ప్రేమతో ప్రజలు ఓటు వేస్తారని చెప్పారు. శనివారం సాయంత్రం శాసనమండలిలో మీడియా ప్రతినిధులతో చిట్‌చాట్ చేశారు. సంక్షేమ పథకాల లబ్ధిదారులే మా ఓటర్లని స్పష్టం చేశారు. నేను పనిని నమ్ముకుని ముందుకు వెళుతునని పేర్కొన్నారు. ఇచ్చిన ప్రతిహామీని నిలబెట్టుకుంటామన్నారు. నాకుస్టేచర్ కాదు స్టేట్ ఫ్యూచర్ నాకు ముఖ్యమని తెలిపారు. 25 లక్షల పైచీలుకు రుణమాఫీ జరిగిందని, ఒక్క కుటుంబంలో నలుగురు ఉన్న రుణమాఫీ లబ్ధిదారుల సంఖ్య కోటి మంది అని పేర్కొన్నారు. ఇచ్చిన మాట ప్రకారం కోటి మంది మహిళలకు కచ్చితంగా లబ్ధిచేకూరుస్తాని మరోసారి చెప్పారు. వారంతా ఇప్పుడు మాట్లాడకుండా మౌనంగా ఉన్నా తప్పకుండా వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కే ఓటేస్తారని అన్నారు. గతంలో ఎన్నికలకు ముందు నేనేంచెప్పానో అదే జరిగింది. భవిష్యత్తులో నేను చెప్పబోయేదే జరుగుతుందని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. వచ్చే ఫైనాన్షియల్ పూర్తయ్యేలోగా రిటైర్‌ఉద్యోగుల బకాయిలచెల్లింపుల వందశాతం పూర్తి చేస్తామన్నారు. ఒక ప్రణాళికాబద్ధంగా రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలు చెల్లిస్తామన్నారు. ఆదాయాన్ని పెంచడం, పేదలకు పంచడమే మాప్రభుత్వ విధానమన్నారు. జనాభా లెక్కల గురించి జిల్లా కలెక్టర్లను కేంద్రం అంచనాలను అడిగింది. 2026లో పూర్తి చేసి 2027లో జనాభా లెక్కలు నోటిపై చేస్తారనే అంచనావుంది. దీనికి అనుగుణంగా కేంద్రం డీలిమిటేషన్‌కు సమాయత్తమవుతోంది. అందుకే దక్షిణాది రాష్ట్రాలునష్టపోకుండా ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. బీసీ సబ్‌ప్లాన్ చేయాలనే ఆలోచన నాకుఉందని పేర్కొన్నారు. అంతకు ముందు సిఎం రేవంత్ అసెంబ్లీలో మాట్లాడుతూ ప్రమాదవశాత్తు కిందపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సమయంలో కెసిఆర్‌ను పరామర్శించిన రోజును గుర్తుచేసుకున్నారు. కెసిఆర్‌ను ఆసుపత్రిలో పరామర్శించి వస్తుంటే అదే ఆసుసత్రిలో ఓఆడబిడ్డ నన్ను రేవంతన్నా అనిపిలిచింది. వెంటనే వెళ్లిఆమె సమస్యను పరిష్కరించా, జీవితంలో నాకు ఇంత కన్నా ఇంకేం కావాలి అని పేర్కొన్నారు. ఒకనాడు ఇందిరాగాంధీని అమ్మా అన్నారు. ఆ తర్వాత ఎన్టీఆర్‌ను అన్నా అన్నారు. ఇప్పుడు నన్ను రేవంతన్నా అని పిలుస్తుంటే చాలా సంతోషంగా ఉందన్నారు.




శనివారం భద్రాద్రి కొత్తగూడెంలో లొంగిపోయిన మావోయిస్టులను మీడియా ముందు ప్రవేశపెట్టిన ఐజిపి చంద్రశేఖర్ రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు

# 64 మంది నక్సల్స్ లొంగుబాటు

>> అధికారులు సంయుక్తంగా ప్రజలతో మమేకమై ప్రజలను ఒప్పించి ప్రభుత్వ విధానాలు చేరే విధంగా చేస్తామన్నారు. మావోయిస్టుల సరెండర్ కు కృషి చేస్తున్న జిల్లా ఎస్పీ పోలీసులు సిఆర్పిఎఫ్ అధికారులకు అభినందనలు తెలిపారు. సరెండర్ అయిన మావోయిస్టులకు ప్రశాంత జీవనం గడపడానికి వ్యవసాయం ,ఉద్యోగం, ఉపాధి బిజినెస్ చేసుకోవడానికి చేయూతనిస్తామన్నారు. కుటుంబ సభ్యులతో ప్రశాంతం గడిపేందుకు పోలీస్ శాఖ తరఫున కృషి చేస్తాం ..సహకారం అందిస్తాం అన్నారు. ఏసియం సభ్యులు..దేవా..ఊంగాలకు ప్రభుత్వం తరఫున 25 వేల నగదు రివార్డును ఐజి అందజేశారు.. ఇంకా వందమందికి పైగా అజ్ఞాతంలో ఉన్నారని, కాలం చెల్లిన సిద్ధాంతాలను, హింస మార్గాన్ని వీడి జన జీవన స్రవంతిలో కలవాలని అన్నారు. అజ్ఞాతంలో ఉన్న వారిని పోలీసుల తరఫున సాదరంగా ఆహ్వానిస్తున్నామన్నారు. సరెండర్ మావోయిస్టులకు ప్రభుత్వం తరఫున రావాల్సిన రివార్డులు . జీవితం ప్రశాంతంగా గడిపేందుకు తప్పకుండా సహకారం అందిస్తామని అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టులు కూడా లొంగిపోవాలని విజ్ఞప్తి చేశారు. గ్రామాలకు వెళ్లి,ప్రజలతో అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటాము.. మావోయిస్టు కుటుంబ సభ్యులు అజ్ఞాతంలో ఉన్నవారు లొంగిపోయేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

# ప్రతి రైతుకు రుణమాఫీ చేశాం

>> విసిలను నియమించాం. సమాజంలో వెనుకబడిన వర్గాలను సైతం తీసుకున్నాంమని, వంద సంవత్సరాల చరిత్ర కలిగిన ఉస్మానియా యూనివర్సిటీకి మొదటిసారి మా ప్రభుత్వం ఒక దళితుల్ని విసిగా నియమించిందన్నారు. నగరం నడిబడ్డన ఉన్న మహిళ యూనివర్సిటీకి మీరు ఎప్పుడైనా వెళ్లారా? అంటూ ప్రశ్నించారు. మేము యూనివర్సిటీకి వీరనారి చాకలి ఐలమ్మ పేరు పెట్టి, కలియతిరిగి పాత వారసత్వ భవనాల మరమ్మతుకు వెంటనే 15 కోట్లు విడుదల చేశామన్నారు. ఇవి కాకుండా 540 కోట్లు భవన నిర్మాణాలకు వెంటనే ఆదేశాలు ఇచ్చాం. ఇది బంధం.. మా అనుబంధం.. ముఖ్యమంత్రి మా రాష్ట్ర ప్రభుత్వ కమిట్మెంట్. యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్కూల్స్ నా భూతో న భవిష్యత్తు అన్నట్లుగా ఉన్నాయన్నారు. 25ఎకరాల్లో డిజిటల్ బోర్డులు, క్రికెట్, ఫుట్‌బాల్ మైదానాలు, బోధన సిబ్బంది అక్కడే ఉండేలా నిర్మాణాలు చేస్తున్నాం. కేంద్ర ప్రభుత్వం కూడా ఒకేసారి 58 ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ మంజూరు చేయలేదు. మేము ఒక్కో స్కూలు 200 కోట్లతో నిర్మిస్తున్నాం. ఇది మా సిఎం కమిట్మెంట్, ఎస్సి, బిసి, ఎస్‌టి వర్గాలు విద్యారంగంపై మా ప్రభుత్వ కమిట్మెంట్ ఇది. మన పిల్లలు ప్రపంచంతో పోటీపడాలని మీరు ఎప్పుడైనా ఆలోచించారా? ఇండియా స్కిల్ యూనివర్సిటీ స్థాపించి మహేంద్ర మహేంద్ర వంటి పారిశ్రామికవేత్తలను పిలిచి వారికి కావాల్సిన నైపుణ్యాలు విద్యార్థులకు నేర్పించి రిక్రూట్మెంట్‌కు అవకాశాలుకల్పిస్తున్నాము. పరిశ్రమలకు అవసరమైన నిపుణులను అందించేందుకు 65.ఐటిలను అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ లుగా తీర్చిదిద్దుతున్నామని, ముఖ్యమంత్రికి సమయం లేదు విద్యాశాఖను పట్టించుకోవడం లేదంటూ భావించడం సరైనది కాదు సిఎం రేవంత్ రెడ్డి విద్యా శాఖకు చేస్తున్న సేవలు చూస్తే గర్విస్తున్నాం అన్నారు. మీ సిఎం లాగానే మా సీఎం కూడా ఉండాలని ఊహించుకుంటే ఎట్లా 11 వేల ఉపాధ్యాయ పోస్టులతో మెగా డిఎస్సీ నిర్వహించాం, మరో ఆరువేల ఖాళీల భర్తీకి కృషి చేస్తున్నామన్నారు. 22,000 మంది ప్రభుత్వ ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాం. మీరు 12 పట్టించుకోకుండా మీరు నిర్వీర్యం చేసిన విద్యాశాఖలో 36,000 మంది ఉపాధ్యాయులను బదిలీ చేసామన్నారు. మీరు ఒక యూనివర్సిటీ, ఆయనకు ఒక యూనివర్సిటీ ధారా దత్తం చేసుకున్నారని అన్నారు. రాష్ట్ర ప్రజలకు లబ్ది జరగద్దు అనేది మీ ఆలోచన, రాష్ట్ర ఖజానా మీలాంటి రాజకీయ నాయకుల కోసం కాదని, పైసా పైసా జమ చేస్తాం పేదలకు పంచుతాం అన్నారు.

# 41 దేశాలపై అమెరికా ట్రావెల్ బ్యాన్!

>> భావిస్తున్నారు. వీటికి కొన్ని మినహాయింపులు కల్పించే అవకాశాలున్నాయి. ఇక మూడోగ్రూప్‌లో పాకిస్థాన్, భూటాన్‌తో పాటు 26 దేశాలున్నాయి. ఈ దేశాలు 60 రోజుల్లోపు తమ లోపాలుపరిష్కరించుకునే ప్రయత్నాలుచేయకపోతే అక్కడి పౌరులకు వీసా జారీని పాక్షికంగా నిలిపివేయాలని యుఎస్ యంత్రాంగం భావిస్తున్నట్లు ఆ మెమోలో ఉంది. విదేశాంగమంత్రి మార్కో రుబియో ఆమోదం తర్వాత అధికార ప్రకటన జారీచేస్తారని తెలుస్తోంది. ట్రంప్ తొలిసారి అధ్యక్షుడుగా ఉన్న సమయంలోనూ ఇలాంటి నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. ఇరాన్‌సహా ఏడు ముస్లిం మెజార్టీదేశాలప్రయాణీకులపై నిషేధం విధించారు. అప్పట్లో ఈనిర్ణయాన్ని అమెరికా సుప్రీంకోర్టుకూడా సమర్థించింది. ఇక 2023లోనూ ట్రంప్ ఈప్రణాళికలు గురించి ప్రస్తావించారు. రెండోసారి అధ్యక్ష బాధ్యతలుచేపడితే గాజా స్ట్రిప్ లిబియా, సోమాలియా, సిరియా యెమెన్ వంటి దేశాలనుంచి పౌరుల రాకపై ఆంక్షలు విధిస్తానని చెప్పారు. దేశభద్రతకు ముప్పు అని భావించేవారిని అమెరికాలోనికి ఎన్నటికీ అనుమతించబోమని ఆయన అన్నారు.

# సిఎం క్షమాపణ చెప్పాలని డిమాండ్

**హైదరాబాద్, మార్చి 15, ప్రభాతవార్త:** ఆరాష్ట్రంలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై శాసనమండలిలో చర్చ ముగిసిన అనం తరం ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమాధానం చెప్పడానికి మండలికి వచ్చారు. శాసనమండలి ఛైర్మన్ ముఖ్యమంత్రిని గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై సమాధానం చెప్పాలని కోరారు. దీంతో బిఆర్ఎస్ సభ్యులు సీఎం రేవంత్ రెడ్డి మాజీ ముఖ్య మంత్రి, బిఆర్ఎస్ అధినేత కెసిఆర్‌పై చేసిన వ్యాఖ్యలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. మార్చురీ భాషకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తూ.. బిఆర్ఎస్ సభ్యులు తమ నిరసనను కొనసాగించారు. మండలి ఛైర్మ న్ ఎన్నిసార్లు చెప్పినా వినిపించుకోలేదు. ఈ దశ లో మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ కలుగజేసుకొని .. ముఖ్యమంత్రి కెసిఆర్‌పై చేసిన వ్యాఖ్యలు సభలో కాదని.. బయట చేశారని.. అదీ కూడా వ్యక్తిగతంగా కాదని.. బిఆర్ఎస్ పార్టీ ప్రస్తుత పరిస్థితిపై మాట్లాడారని .. దానికి .. గవర్నర్ ప్రసంగానికి సంబంధం లేదని ఆందోళనను విరమించి సభకు సహకరించాలని కోరారు. మంత్రులు చెప్పినప్పటికీ బిఆర్ఎస్ సభ్యులు తమ నిరసనను విరమించుకోలేదు. దీంతో మరోసారి మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి కల్పించుకొని ముఖ్యమంత్రి తన ప్రసంగంలో మీరు కోరుతున్న వ్యాఖ్యలపై కూడా సమాధానం చెబుతారని.. నిరసనను విరమించి సహకరించాలని కోరారు. దీంతో బిఆర్ఎస్ సభ్యులు తమ నిరసనను విరమించుకోకుండా తాము వాకౌట్ చేస్తున్నట్టు ప్రకటించి సభ నుంచి బయటికెళ్లిపోయారు. అనంతరం ముఖ్యమంత్రి తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ.. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై సమాధానమిచ్చారు.

స్టాలిన్ ఏర్పాటుచేసిన సమావేశానికి సంబంధించిన అంశంపై కాంగ్రెస్ పార్టీ అధిష్టానం, ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ దేశ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దక్షిణాది ఉత్తరాది అని విభజించాలనే కుట్ర కాంగ్రెస్ పార్టీ చేస్తున్నదని, దేశ సమైక్యతకు సమగ్రతకు భంగం కలిగేలా కాంగ్రెస్, ఆ పార్టీ ముఖ్యమంత్రులు వ్యవహరిస్తున్న తీరుఅభ్యంతరకరమని పేర్కొన్నారు. అయితే 1971 ప్రకారం డీలిమిటేషన్ అభ్యంతరంలేదని సిఎం స్టాలిన్ స్పష్టంచేస్తున్నారు. కాగా. 1971 తర్వాత దక్షిణాది కంటే ఉత్తర భారతదేశంలోనే జనాభా ఎక్కువగా పెరిగింది. యూపీని ఉదాహరణగా తీసుకుంటే 8 కోట్ల నుంచి 24 కోట్లకు జనాభా పెరిగింది. ప్రస్తుతమున్న జనాభా లెక్కలప్రకారం ఉత్తర ప్రదేశ్‌లో లోక్‌సభ స్థానాలసంఖ్య 80 నుంచి 143సీట్లకు అదనంగా పెరుగుతుంది. బీహార్‌లో లోక్‌సభ స్థానాలు 40నుంచి 79కి పెరుగుతాయి. ఈ రెండు రాష్ట్రాల నుంచే 222 ఎంపీలు పార్లమెంటులో ప్రాతినిధ్యంవహించే పరిస్థితి వస్తుంది. రెండు తెలుగు రాష్ట్రాల్లో పెరిగే సీట్లు కేవలం 12మాత్రమే పెరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం 42గా ఉన్న లోక్‌సభ స్థానాల సంఖ్య 54కి పెరుగుతుంది. 1973 తర్వాత దేశంలో జనాభా భారీగా పెరిగినా మళ్లీ డీలిమిటేషన్ ప్రక్రియలో భాగంగా సీట్ల సంఖ్యను పెంచలేదు. ఎందుకంటే 1976లో అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ ఈప్రక్రియను 25 సం॥పాటు నిలిపివేస్తూ సంచలన నిర్ణయంతీసుకుంది. ఆ నిర్ణయం కోసం ఏకంగా 42వ రాజ్యాంగసవరణ కూడాచేశారు. ఆతర్వాత 2001లో అప్పటికి అధికారంలో ఉన్న ఎన్డీఏ నేతృత్వంలోని అటల్ బిహారీ వాజ్‌పేయ్ సర్కారు ఈ డీలిమిటేషన్ ప్రక్రియను మరో 25 ఏళ్లు పొడగించారు. దీంతో 1976లో ఆగిపోయిన డీలిమిటేషన్ ప్రక్రియ 50 ఏళ్ల పాటు వాయిదా పడింది. దీంతో 2026 వరకు దేశంలో నియోజకవర్గాల పునర్విభజన చేసేందుకు అవకాశం లేకుండా పోయింది.

# డీలిమిటేషన్‌పై దక్షిణాది రాష్ట్రాల ఆందోళన

**డాక్టర్ వై.నాగేశ్వర్‌రావు**

దేశంలో రాజుకున్న మరో రాజకీయ రగడ తారస్థాయికి చేరుతోంది. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన యోచన ప్రకంపనలు సృష్టిస్తోంది. పలు రాష్ట్రాల ముఖ్యమంత్రుల అభ్యంతరాలు, ఆందోళనలు ఓ పక్క. అబ్బే అలాంటిదేం లేదనే కేంద్ర పెద్దలు ప్రకటనలు మరోపక్క. తమిళనాట అఖిలపక్షం భేటీతో ఈ చర్చ మరింత వేడెక్కింది. మార్చి 22న చెన్నైలో జరగబోయే దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ప్రజాప్రతినిధుల సమావేశం మరింత దుమారం లేపింది. లోక్‌సభ, అసెంబ్లీ స్థానాల పునర్విభజన ప్రక్రియ చుట్టూ అల్లుకున్న వివాదమే ఇదంతా. వివిధ రాజకీయపార్టీల అధినేతలు కూడా దీనిపై తమ అభిప్రాయాలు కుండబద్దలు కొడుతున్నారు. జనాభా నియంత్రణ పాటించడమే దక్షిణాదికి శాపమా? 2026 తర్వాత జరగబోయే జనాభా లెక్కలే ప్రాతిపదికగా తీసుకుంటే జరిగే నష్టం పూడ్చేదెవరు? దక్షిణాది రాష్ట్రాల రాజకీయ ప్రాధాన్యం ఏమైపోవాలి? అనే ప్రశ్నలకు స్పష్టమైన సమాధానం దొరకట్లేదు. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన వాదనలు ఉత్తరాది, దక్షిణాది రాష్ట్రాలు అనే విభజన చర్చకు దారితీస్తున్నాయి. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన అంశంపై ముందస్తు జాగ్రత్త కోసం దక్షిణాది రాష్ట్రాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. డీలిమిటేషన్‌కు వ్యతిరేకంగా దక్షిణాది రాష్ట్రాలు కదులుతున్నాయి. జనాభా ప్రతిపాదికన డీలిమిటేషన్ జరిగితే దక్షిణాది రాష్ట్రాల్లో లోక్‌సభ స్థానాల సంఖ్యతగ్గిపోతుందని, పార్లమెంట్‌లో ప్రాతినిధ్యం తగ్గిపోతే కేంద్రం ఏకపక్షంగా వ్యవహరించి దక్షిణాది రాష్ట్రాలకు తీవ్రమైన అన్యాయం చేసే అవకాశం ఉందని భావిస్తున్నాయి. దీనికి వ్యతిరేకంగా తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ పోరును ముమ్మరం చేస్తున్నారు. డీలిమిటేషన్ వల్ల దక్షిణాది రాష్ట్రాలకు చాలా అన్యాయం జరుగుతుందని ఆయన ఆరోపిస్తున్నారు. అందుకే ఆయా రాష్ట్రాలను ఏకతాటి పైకి తీసుకురావడం కోసం స్వయంగా రంగంలోకి దిగారు. మార్చి 22న చెన్నైలో నిర్వహించనున్న సమావేశానికి హాజరు కావాలని కోరుతూ 6 రాష్ట్రాల ముఖ్యమంత్రులకు, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నేతలకు ఆహ్వానం పంపారు.

నియోజకవర్గాల పునర్విభజనతో దక్షిణాది రాష్ట్రాలకు కలిగే నష్టాలు, చేపట్టాల్సిన కార్యాచరణపై చర్చించేందుకు ఈ సమావేశం నిర్వహిస్తున్నారు. మార్చి 5న చెన్నైలోని తమిళనాడు సచివాలయంలో జరిగిన అఖిలపక్ష సమావేశంలో 58 పార్టీలు పాల్గొన్నాయి. అందులో వివిధ తీర్మానాలు ఆమోదించారు. డీలిమిటేషన్ వల్ల ప్రభావితమయ్యే రాష్ట్రాలను ఏకతాటిపైకి తీసుకురావడం ద్వారా ఉమ్మడి కార్యాచరణ కమిటీని ఏర్పాటు చేయాలని కూడా ఈ సమావేశంలో నిర్ణయించారు. అందుకే స్టాలిన్ వివిధ రాష్ట్రాల సీఎంలకు, ముఖ్య రాజకీయ నేతలకు తమ మంత్రుల ద్వారా ఆహ్వానం పంపుతున్నారు.



స్వయంగా లేఖలు అందజేయిస్తున్నారు. బంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, కేరళ సిఎం పినరయి విజయన్, కర్ణాటక సిఎం సిద్ధరామయ్య, కర్ణాటక ఉపముఖ్యమంత్రి డీకె శివకుమార్, పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్, ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబునాయుడు, ఏపీ మాజీ సీఎం జగన్మోహన రెడ్డి, ఒడిశా మాజీ సిఎం నవీన్ పట్నాయక్, తెలంగాణ మాజీ సిఎం కెసిఆర్‌కు స్టాలిన్ స్వయంగా లేఖలు రాశారు. వీటిని తమ మంత్రులకు ఇచ్చి ఆయా రాష్ట్రాల సీఎంలను నేరుగా ఆహ్వానించమని చెప్పారు. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన అంశంపై చర్చించేందుకు మార్చి 22న నిర్వహించే సమావేశానికి హాజరుకావాలని వారందరినీ కోరాలని సూచించారు. ఈ క్రమంలో తమిళనాడు పరిశ్రమల మంత్రి డీఆర్‌పీ రాజానేతృత్వంలోని బృందంమార్చి 11న ఒడిశాకు వెళ్లి బిజు జనతాదళ్ నేత, మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌కు లేఖను అందించింది. మార్చి 22న చెన్నైలో నిర్వహించే సమావేశానికి హాజరు కావాలని ఆహ్వానించింది. తమిళనాడు అటవీమంత్రి పొన్ముడి, ఎంపీ అబ్దుల్లా నేతృత్వంలోని బృందం బుధవారం కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను, ఉపముఖ్యమంత్రి డీకె శివకుమార్‌ను కలిసింది. గురువారం రోజు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఢిల్లీలో ఆ రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కె.ఎన్.నెహ్రూ, డీఎంకే నాయకురాలు కనిమొళి నేతృత్వంలోని బృందం కలిసి లేఖ అందించారు. 2026తర్వాత చేపట్టే జనగణన వరకునియోజకవర్గాల పునర్విభజన చేపట్టకూడదని నిబంధనలున్నా కేంద్ర ప్రభుత్వం మాత్రం అంతకుముందుగానే ఈ ప్రక్రియను తెరపైకి తెచ్చిందని తమిళనాడు సీఎంస్టాలిన్ తన లేఖలో పేర్కొన్నారు. నియోజకవర్గాల పునర్విభజనపై తమరాష్ట్రంలో ఇప్పటికే అఖిలపక్ష సమావేశం ఏర్పాటుచేశామని లేఖలో వెల్లడించారు. ఈ విషయంలో తమిళనాడు, కేరళ, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, పశ్చిమ బెంగాల్, ఒడిశా, పంజాబ్ రాష్ట్రాలతో కూడిన ఐక్యకార్యాచరణ కమిటీలో (జేఏపీ) చేరేందుకు అంగీకారం తెలపాలని స్టాలిన్ లేఖలో కోరారు. దీనిపై సిఎం రేవంత్‌రెడ్డి స్పందిస్తూ నియోజకవర్గాల పునర్విభజనతో దక్షిణాది రాష్ట్రాలపై కేంద్రప్రభుత్వం చేస్తున్న కుట్రను తిప్పికొట్టే కార్యాచరణ చేపడతామని స్పష్టంచేశారు. అది నియోజకవర్గాల పునర్విభజన కాదని దక్షిణాది రాష్ట్రాల ప్రాధాన్యతను కుదించే ప్రయత్నమని ఆయన ఆరోపించారు. దక్షిణాది రాష్ట్రాల నుంచి బీజేపీకి పెద్దగా ప్రాతినిధ్యం లేదని, దక్షిణాది రాష్ట్రాల్లో ఓటమితో ఈ రాష్ట్రాలపై ప్రతీకారం తీర్చుకోవాలని బీజేపీ భావిస్తోందని సీఎం ఆరోపించారు. దక్షిణాది రాష్ట్రాలపై బీజేపీ నేతృత్వంలోని కేంద్రప్రభుత్వం చేస్తున్న కుట్రలను అడ్డుకుంటామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం అనుమతి తీసుకొని తాను చెన్నై సమావేశానికి హాజరవుతానని తెలిపారు. నియోజకవర్గాల పునర్విభజనపై తెలంగాణ రాష్ట్రంలోనూ చర్చలు జరిపేందుకు అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని తాము నిర్ణయించుకున్నట్లు రేవంత్‌తెలిపారు. చెన్నైలో నిర్వహించే సమావేశంలో నియోజకవర్గాల పునర్విభజనతో కలిగే నష్టాలు వాటిని అధిగమించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై కార్యాచరణను రూపొందిస్తామని సీఎం స్పష్టం చేశారు. నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించి ఏవిధంగా వ్యవహరించాలనే అంశంపై తమిళనాడు సిఎం ఎం.కె.స్టాలిన్ కీలక పాత్ర పోషిస్తున్నారని, ఆయనను ప్రోత్సహిస్తామని సీఎం తెలిపారు. గురువారం రోజు సాయంత్రం బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌ను హైదరాబాద్‌లో తమిళనాడు మున్సిపల్ పరిపాలన మంత్రి కె.ఎన్.నెహ్రూ, ఎంపీ ఎన్.ఆర్.ఇళంగో కలిశారు. స్టాలిన్ ఆహ్వానలేఖను అందించారు. తమిళనాడు సమాచార, సాంకేతిక మంత్రి పీ.టీ.ఆర్ పళనివేల్ రాజన్ నేతృత్వంలోని బృందం కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్‌ను కలిసి ఆహ్వానించనుంది. డీఎంకే నాయకురాలు కనిమొళి నేతృత్వంలోని బృందం బంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీని ఆహ్వానించనుంది. అయితే ఈ సమావేశానికి ఏపీ సిఎం చంద్రబాబునాయుడు హాజరయ్యే అవకాశంలేదు. స్టాలిన్ చేపట్టిన పోరాటానికి మద్దతు పలుకుతున్నట్లు కెటిఆర్ ప్రకటించారు. తెలంగాణలో అసెంబ్లీ సమావేశాలు కొనసాగుతున్నందున బిఆర్ఎస్ పార్టీ తరపున ఎవరైనా కీలక నేతలు వెళ్లనున్నారు. కాగా, నియోజకవర్గాల పునర్విభజన విషయంలో కేంద్రప్రభుత్వం కుట్ర పన్నుతున్నది అని ముఖ్యమంత్రిరేవంత్ రెడ్డి స్పందించిన తీరుపై బిజెపి నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దక్షిణాదిలో ఒక్కసీటు కూడా తగ్గదుఅని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా స్పష్టం చేశారని బిజెపి ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్ పేర్కొన్నారు. వచ్చే సంవత్సరం తమిళనాడులో శాసనసభ ఎన్నికలు జరుగుతున్నందున ఇప్పటి నుంచే ప్రజల దృష్టి మళ్లించి ఎన్నికల్లో లబ్ధి పొందాలని దురాలోచనతోనే తమిళనాడు సిఎం డీలిమిటేషన్ తెరమీదికి తీసుకొచ్చి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. 2026లో రాజ్యాంగ సవరణ తరువాత డీలిమిటేషన్‌పై చట్టంరూపొందుతుందని, కేంద్రప్రభుత్వం ఇప్పటివరకు పునర్విభజనపై ఎలాంటి ప్రకటన, దానికి సంబంధించిన విధి విధానాలను రూపొందించలేదనేదన్నారు. దీనిపైన పార్లమెంటులో చర్చ జరుగుతున్న సమయంలో అభిప్రాయాలను కాంగ్రెస్ పార్టీ చెప్పవచ్చు కదా అన్నారు.

# ఇక 'ట్రిపుల్' ఇంజిన్లు!

హర్యానా

**ఎ.వి.వి ప్రసాద్**

పట్టాలపైకి ట్రిపుల్ ఇంజిన్లు వస్తున్నాయి. మెజారిటీ రాష్ట్రాలలో అధికారంలో ఉన్న బిజెపి ఇప్పుడు 'డబుల్' దాటి 'ట్రిపుల్' ఇంజిన్ దిశగా దూసుకుపోతున్నట్లు కనిపిస్తోంది. హర్యానాలో గతవారం జరిగిన స్థానిక ఎన్నికలే అందుకు ఉదాహరణ. అసెంబ్లీ ఎన్నికల్లో హ్యాట్రిక్ సాధించిన ఆరు నెలలలోపునే డబుల్ నుంచి ట్రిపుల్ ఇంజన్ 'స్థాయి'కి బిజెపి చేరింది. కార్పొరేషన్ ఎన్నికల్లో పది నగరాలకు గాను తొమ్మిది చోట్ల బిజెపి అఖండ విజయం సాధించింది. పదవ సీటులో ఇండిపెండెంట్ అభ్యర్థి విజయం సాధించడంతో ఆ సీటు కూడా తమదేనని ఫలితాలు వెలువడిన వెంటనే అమిత్ షా ప్రకటించడాన్ని బట్టి ఆ రాష్ట్రంలో రెండు, మూడవ ఇంజిన్లు పూర్తిగా బిజెపి గుప్పెటలోకి చేరాయనిపిస్తుంది. ఆ పది సీట్లలో ఏడు బిజెపి సిట్టింగ్ స్థానాలే కావడం మరో విశేషం. మాజీ సిఎం భూపిందర్ సింగ్ హుడా ఇలాఖాలోని రోహ్‌తక్‌లో కూడా కాంగ్రెస్ ఓటమి చవి చూడడాన్ని బట్టి ఇక ఆ పార్టీకి రాష్ట్రంలో తేరుకొనే అవకాశమే లేదని తేలిపోయింది. రోహ్‌తక్‌తోపాటు మరో కీలక నగరమైన గురుగ్రామ్‌పై కూడా భూపిందర్‌కే పట్టు ఎక్కువగా ఉంది. అయితే ఈ కార్పొరేషన్ ఎన్నికల్లో అది కూడా చేజారిపోయింది. బిజెపి మేయర్ అభ్యర్థులు అంబాలా, గురుగ్రామ్, సోనిపట్, రోహ్‌తక్, కర్నాల్, పానిపట్, హిస్సార్, యమునానగర్‌లో ఘనవిజయం సాధించారు. ఒక్క మానేసర్‌లో మాత్రం ఇంద్రజిత్ యాదవ్ అనే స్వతంత్ర అభ్యర్థిని విజయం వరించింది. బిజెపి అభ్యర్థులు గెలిచినప్రతిచోటా భారీ మెజారిటీని సాధించడం కూడా మరోవిశేషం. అంబాలలో బిజెపి నాయకురాలు శైలజా సచ్‌దేవ్‌సమీప కాంగ్రెస్ అభ్యర్థి అమిషాచావ్లాపై దాదాపు 21 వేల ఓట్ల ఆధిక్యతను సాధించారు. అలాగే గురుగ్రామ్‌లో బిజెపి అభ్యర్థి రాజ్‌రాణి 1.79 లక్షల ఓట్ల ఆధిక్యతతో విజయం సాధించారు. పార్టీకి అత్యంత ముఖ్యమైన విజయం ఫరీదాబాద్ నుంచి లభించింది. అక్కడ ప్రవీణ్‌బాత్రా జోషి జాతీయ రికార్డును సైతం అధిగమిస్తూ 3.16 లక్షల ఓట్ల ఆధిక్యతను సాధించడం మరింత ఆశ్చర్యం కలిగిస్తుంది. సాధారణంగా స్థానిక ఎన్నికల్లో ఎవరికి ఆధిక్యత లభించినా ఓట్ల తేడా స్వల్పంగానే ఉంటుంది. దానికి ప్రధాన కారణం స్థానిక సమస్యలపై ఎన్నికలు జరగడం. మేయర్లు కార్పొరేటర్లు ప్రజలతో ఎక్కువ సన్నిహిత సంబంధాలు కలిగి ఉండడంతో పోలింగ్‌వేళ దాని ప్రభావం తప్పక కనిపిస్తూంటుంది. కానీ హర్యానాలో జరిగిన కార్పొరేషన్ ఎన్నికల్లో అసెంబ్లీ ఎన్నికలలో కనిపించే వ్యత్యాసం ఓటర్ల నుంచి వ్యక్తమై నట్లు కనిపిస్తుంది. గత అక్టోబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పరాజయం పాలైనా రోహ్‌తక్, ఝుజ్జర్ జిల్లాలపై తన పట్టును ప్రదర్శించింది. ఎనిమిది సీట్లలో ఆ పార్టీ ఏడు చోట్ల ఘన విజయం సాధించింది.



కమలం

అయితే తర్వాత కొద్ది నెలల్లోనే కాంగ్రెస్ మరింత బలహీనపడినట్లుగా తాజా ఎన్నికలు రుజువు చేస్తున్నాయి. తొలిసారి మునిసిపల్ ఎన్నికలు జరిగిన మానేసర్‌లో స్వతంత్ర అభ్యర్థి ఇంద్రజిత్ యాదవ్ విజయం సాధించినా, ఆధిక్యతమాత్రం దాదాపు రెండు వేలకోట్లు మాత్రమే లభించింది. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలే కార్పొరేషన్‌లో కూడా కనిపించాయనే అభిప్రాయం అందుకనే వ్యక్తమవుతోంది. మార్చి 2వ తేదీన కొన్ని కార్పొరేషన్లలోను, తొమ్మిదవ తేదీన మరికొన్ని కార్పొరేషన్లలోను ఎన్నికలు జరిగాయి. అయితే ఎక్కడ కూడా కాంగ్రెస్ గట్టి పోటీని ఇవ్వలేకపోయిందని ఆయా కార్పొరేషన్లల్లో అభ్యర్థులకు లభించిన ఓట్ల శాతం చూస్తే అర్థమవుతుంది. ఎన్నికల ప్రచార కాంగ్రెస్ సర్వశక్తులను సమీకరించి పోరాడింది. కాంగ్రెస్ సీనియర్ నేతలు సచిన్ పైలట్, హుడా వంటి వారు విస్తృతంగా ప్రచార కార్యక్రమం నిర్వహించారు. అసెంబ్లీ ఎన్నికల్లో 60 శాతం ఓటింగ్ నమోదు కాగా, స్థానిక ఎన్నికల్లో 41శాతం మాత్రమే రికార్డు అయింది.

కాంగ్రెస్ ఇంతగా బలహీనపడడానికి సంస్థాగత, సైద్ధాంతిక సమస్యలను ఎక్కువగా ఎదుర్కొనడమే అని పిస్తుంది. కాంగ్రెస్ ఓట్ల వాటా బిజెపి కంటే 0.85 శాతం పాయింట్లు మాత్రమే తక్కువ ఉన్నప్పటికీ ఆపార్టీ ఓటమికి రెండు అంశాలు ప్రధానంగా కన్పిస్తున్నాయి. జాట్ వ్యతిరేక సమీకరణ కాంగ్రెస్ తిరోగమనానికి చాలా వరకు కారణమనే అభిప్రాయం చాలా మంది నుంచి వ్యక్తమవుతోంది. 2019 అసెంబ్లీ ఎన్నికలతో పోల్చి చూస్తే, బిజెపి తన ఎనిమిది అదనపు సీట్లలో ఆరుచోట్ల పట్టును నిలుపుకొనగలిగింది. గత సంవత్సరం నుంచి వరుసగా జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికలలో బిజెపి తన పట్టును పెంచుకుంటూ వెళ్తున్నట్లే కనిపిస్తుంది. డబుల్ ఇంజిన్ సర్కార్ గతంలో బిజెపి నినాదమైతే, ట్రిపుల్ ఇంజిన్ తాజా నినాదంగా కనిపిస్తోంది. 15రాష్ట్రాల్లో బిజెపి స్వయంగా అధికారంలో ఉండగా, మరో ఐదుచోట్ల భాగస్వామ్యపక్షాలతో కలిసి అధికారం చెలాయిస్తోంది. హర్యానాలో ప్రస్తుతం ట్రిపుల్ ఇంజిన్ అంటే స్థానిక అధికారం కూడా సాధించడంతో, అదే విధానం మిగిలిన రాష్ట్రాలలోకూడా కొనసాగించాలనే పట్టుదలతో కనిపిస్తోంది. ఢిల్లీ మునిసిపల్ కార్పొరేషన్ ఎన్నికలు ఏప్రిల్‌లో జరుగనుండడంతో హర్యానా ఫలితమే అక్కడా లభించాలనే దిశగా బిజెపి కదులుతున్నట్లు తెలుస్తోంది. ఢిల్లీ బిజెపి అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవ్ రెండు రోజుల క్రితం ప్రకటన చేస్తూ అక్కడ కూడా ట్రిపుల్ ఇంజిన్ తథ్యమని అన్నారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి విజయం సాధించిన తర్వాత ఆప్‌కు చెందిన ముగ్గురు కార్పొరేటర్లు బిజెపిలో చేరడాన్ని బట్టి ఆపార్టీ పావులను ఏ విధంగా కదుపుతున్నదో అర్థమవుతుంది. దక్షిణాదిలో తగినంత బలం లేకపోవడంతో ట్రిపుల్ ఇంజిన్‌ను ఉత్తరాదిలోనే ఎక్కువ నడపాలనే ఉద్దేశ్యంతో బిజెపి ఉన్నట్లు కనిపిస్తోంది. మరో నాలుగు రాష్ట్రాలలో కూడా వచ్చే అయిదారు నెలల్లో కార్పొరేషన్ ఎన్నికలు జరగనున్నాయి. ఎన్ని చోట్ల ట్రిపుల్ ఇంజిన్ నడుస్తుందో చూడాలి.

# సెంట్‌కామ్ ఆపరేషన్!

ఇరాక్

**గన్ని మోహన్**

అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థగా చెలామణి అవుతున్న ఇస్లామిక్ స్టేట్ ఆఫ్ ఇరాక్ సిరియా (ఐసిస్) మరో బలమైన దెబ్బ తగిలింది. ఆ సంస్థ గ్లోబల్ లీడర్‌గా వెలుగొందుతున్న అబ్దుల్లా మక్కీ ముస్లిల్ రుఫాయిని అంతం చేసినట్లు ఇరాక్, అమెరికా సంకీర్ణ సేనలు ప్రకటించాయి. అబూ ఖదీజాగా పేరుపడిన ఈ గ్లోబల్ టెర్రరిస్టు ఐక్యరాజ్యసమితి తన నిషేధిత జాబితాలో కూడా ఉంచింది. ఇరాక్‌లోనే కాకుండా ప్రపంచంలోనే అత్యంత ప్రమాదకరమైన ఉగ్రవాద నాయకుడిగా అబూఖదీజాకు పేరుంది. అమెరికాపై ఉగ్రదాడులు జరిగిన తర్వాత ఐసిస్, అల్‌ఖైదా వంటి ఉగ్రసంస్థలను నిర్మూలించేందుకు అమెరికానడుం బిగించిన సంగతి తెలిసిందే. అల్‌ఖైదా అగ్ర నాయకత్వాన్ని అంతంచేసిన అమెరికా ఇప్పుడు అదే దారిలో ఐసిస్‌పైనా ఫోకస్‌పెంచింది ఇరాక్, సిరియాలు స్థావరంగా చేసుకుని గ్లోబల్ కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఈ సంస్థ చీఫ్‌లను చాకచక్యంగా మట్టుపెట్టిన అమెరికా ఇప్పుడు గ్లోబల్ వ్యవహారాలు పర్యవేక్షించే నంబర్‌టూ నాయకుడిగా చెలామణి అయిన అబూ ఖదీజాను మట్టుబెట్టామని ప్రకటించింది. ఇరాక్ ప్రధానమంత్రి మహ్మద్ షియా అల్‌సుదాని ఈమేరకు మీడియా సమావేశం పెట్టిమరీ ప్రకటించారు. ఇరాక్, సిరియాలను స్థావరంగా చేసుకుని ఐసిస్ గ్లోబల్ కార్యకలాపాలు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఇస్లామిక్ రాజ్యస్థాపన కోసం శ్వేత జాతి దురహంకారాన్ని అణిచివేస్తామన్న నినాదంతో ఐసిస్ తన కార్యకలాపాలు ఒక దశలో ముమ్మరం చేసింది. అందుకు తగినట్లుగానే ఇస్లామిక్‌స్టేట్ కఠినమైన ఇస్లామిక్ నిబంధనలను సిరియా, ఇరాక్‌లలో కొన్ని మిలియన్ల జనాభాపై అమలు చేసింది. మధ్యప్రాచ్యం, పాశ్చాత్య ప్రాంతం, ఆసియా దేశాల్లో మళ్లీ విస్తృతంచేసే లక్ష్యంతోనే అబూఖదీజా తన కార్యకలాపాలను ముమ్మరం చేసినట్లు సమాచారం. ఐసిస్ మొదటి నేత అబూబాకర్ అల్ బాగ్దాది ఇరాక్, సిరియాల్లో 2014 ప్రాంతంలో నాలుగో వంతుభూభాగం ఆక్రమించి ఇస్లామిక్ రాజ్యంగా ప్రకటించుకున్నాడు. అమెరికా ప్రత్యేక దళాలు 2019లో వాయవ్య సిరియాలో నిర్వహించిన ప్రత్యేక ఆపరేషన్‌లో అంతం అయ్యేంతవరకూ తానే ఇస్లామిక్ రాజ్యఅధిపతిగా చెలామణి అయ్యాడు. ఆ తర్వాత అతని గ్రూప్ మొత్తం సంకీర్ణ సేనల చేతుల్లో ధ్వంసమైన తర్వాత ఆగ్రూపు కార్య కలాపాలు కొంతమేర చల్లబడ్డాయి. మళ్లీ అబూ ఖదీజాతో ఊపందుకున్నట్లు సమాచారం. ప్రపం చ వ్యాప్తంగా ఐసిస్ మిలిటెంట్లు, సానుభూతి పరులతో సంప్రదింపులు, వారికి ఆర్థికసాయం, నిధుల సమీకరణ వంటి కార్యకలాపాలను ఈ అబూఖదీజా నిర్వహించే వాడని ఇరాక్ చెపుతోంది. అమెరికా సెంట్రల్ కమాండ్ అంటే సెంట్‌కామ్ అబూఖదీజా ఐసిస్‌లో చురుకుగా మళ్లీ కార్యకలాపాలు ప్రారంభించినట్లు గుర్తించడంతో అతనిపై ఇరాక్ దళాల సాయంతో తన నిఘా నెట్‌వర్క్ మొత్తం కేంద్రీకరించింది.



అబూఖదీజా

అందుకు తగినట్లుగానే ఐసిస్ 2024 మొదటి అర్థసంవత్సరంలో సుమారు 153 సార్లుదాడులు నిర్వహించినట్లు కూడా తేలింది. అయితే ఇవి కేవలం ఇరాక్, సిరియాలకే పరిమితం కావడం ఆపై ఇతర దేశాలకు విస్తరించకపోవడం కొంత ఉపశమనం కల్పించింది. అబూఖదీజాతోపాటు అతడికి సహాయకుడుగా ఉన్న మరొక మిలిటెంట్ కూడా తమదాడిలో అంతమైనట్లు ఇరాక్, సెంట్‌కామ్ స్వయంగా ప్రకటించాయి. మిలిటరీదళాల దాడి ఎదురైతే ఆత్మాహుతితో చనిపోవాలనుకుని ఈ ఇద్దరూ కూడా ఆత్మాహుతి దుస్తులు ధరించారు. 2023 లోనే అబూఖదీజా విదేశీ కార్యకలా పాలు నిర్వహించడంలోచురుకుగా ఉన్నట్లు గుర్తించారు. ఐసిస్ నియంత్రణలోని సిరియా ప్రాంతాలకు గవర్నర్‌గా కొనసాగుతున్నట్లు కూడా కనిపెట్టారు. 2017లోనే ఇరాక్‌లో ఐసిస్ ప్రాదేశికంగా ఓటమి చవిచూసినా ఆ గ్రూపులోని అవశేషాలు ఇంకా చురుకుగానే ఉన్నాయి. ఇరాకీ భద్రతా దళాలపై అప్పుడప్పుడూ దాడులుచేస్తున్నాయి. దీనితో అప్రమతమైనసంకీర్ణ సేనలు అబూఖదీజాను టార్గెట్‌చేసాయి. ఇరాకీప్రభుత్వం, కుర్దిష్ ప్రాంతీయ ప్రభుత్వ నిఘా సమాచారం సమన్వయంతో అబూఖదీజాను అంతం చేసారు. నిజానికి 2017నాటికి ఐసిస్ ఇరాక్‌లోను, 2019 నాటికి సిరియాలో కూడా అత్యధికశాతం విచ్ఛిన్నం అయినట్లే చెప్పాలి. కానీ ఈ గ్రూపు అవశేషాలు మారుమూల గ్రామీణ ప్రాంతాలు, సరిహద్దుప్రాంతాల్లో చురుకుగా కొనసాగుతున్నాయి. తరచూ చేస్తున్న దాడులే ఇందుకు నిదర్శనం. దాడి పూర్తయిన తర్వాత సెంట్‌కామ్ దళాలు, ఇరాక్ సైనిక అధికారులు ఆప్రాంతానికి వెళ్లారు. గతంలో జరిగిన దాడిలో అబూఖదీజా నుంచి రక్తనమూనాలు సేకరించి డిఎన్ఎపరీక్షలు సిద్ధం చేసారు. ఆ నమూనాలతోసేకరించిన శాంపిల్స్ మ్యాచ్ కావడంతో మరణించింది అబూఖదీజాయే అని అమెరికా సెంట్‌కామ్ దళపతులు ప్రకటించారు. దీనితో వాయవ్య సిరియాలో బలంగా ఉన్న ఐసిస్‌కు పెద్ద విఘాతమే కలిగిందని చెప్పవచ్చు. సిరియాను కేంద్రంగా చేసుకుని ఐసిస్‌ను దశదిశలా విస్తరించాలని కసరత్తులుచేసిన అబూ బాకర్ అల్‌బాగ్దాది తాను దాక్కున్న బంకర్‌లోనే 2019లో హతం అయ్యాడు. అమెరికా ప్రత్యేక జాగిలాలు ముందుగావెళ్లి బాగ్దాదీని చుట్టుముట్టాయి. అదే అదునుగా సంకీర్ణసేనలు ఆనాడుచేసిన ఉపరితలదాడులతో బాగ్దాదీ అంతమయ్యాడని అటు ఇరాక్, ఇటు సిరియాలు కూడా ప్రకటించాయి. రానురాను సిరియాలో వెల్లువెత్తిన అంతర్యుద్ధంలో అధ్యక్షుడు రష్యాకుపారిపోయి తలదాచుకోవడం అక్కడ శాంతియుత ప్రభుత్వ ఏర్పాటుకు ప్రణాళికలు అమలులోకి రావడం జరిగాయి. అదే క్రమంలో ఇరాక్‌లో కూడా అమెరికా సైనిక మద్దతుతో ఉగ్రవాదంపై ఉమ్మడిపోరు నినాదంతో ఆ దేశం ఉగ్రమూలాలనుంచి బయటపడే కసరత్తులు చేస్తోంది. అందులో భాగంగానే నేడు ఈ అబూఖదీజా అంతం అనిచెప్పాలి. మొత్తంగా చూస్తే ఇరాక్, సిరియాలకు ఇకపై ఐసిస్ ముప్పుగణనీయంగా తగ్గిందనే చెప్పుకోవచ్చు.

# సుంకాల సమరంలో సామాన్యులే సమిధలా?

**బి. లలితానంద ప్రసాద్**

యుద్ధం అనేది మరో రూపంలో వ్యాపార కొనసాగింపు బెర్ట్రాండ్ బ్రెస్ట్ తన మదర్ కరేజ్ అండ్ హర్ చిల్డ్రెన్ నాటకంలో అన్నమాటలు. హిట్లర్ అప్పట్లో(1939) పోలండ్‌ని ఆక్రమించిన సందర్భం నాటివి. అయినా ఇప్ప టికీ ఏదోరూపంలో ప్రపంచమంతటా వర్తిస్తాయి. రెండో సారి ట్రంప్ హయాంలో మరింతగా, సాధారణ యుద్ధాలు అవి జరిగే ప్రాంతాలకు అందులో పాల్గొన్న దేశాలకు సహ జంగా పరిమితం అవుతాయి. అయితే అసలు యుద్ధంకన్నా ప్రమాదభరితమైనవి ఇప్పుడు ట్రంప్ తలపెట్టిన విశ్వవ్యాప్త టారిఫ్( సుంకాల) యుద్ధం. దీని ప్రభావాలు, పర్యవసానాలు, విపరిణామాల నుండి యావత్ మానవాళి తప్పించుకోలేదు. ఇప్పటికే వివిధ రూపాల ప్రకటితం అవుతున్న ప్రకంపనలు ముందుముందు మరింత తీవ్ర రూపం దాల్చవచ్చు. వీటి దుష్ప్రభావాలు పడనిప్రాంతం, రంగం, దేశం ఉండక పోవచ్చు. కేవలం మోతాదుల్లో తేడాఉండొచ్చు. ఇందులో పైకి మీడియా ద్వారా నిత్యం తెలియవచ్చు. గణాంక వివ రాలు, దామాషా, గుణకాలు, విభజనలు, మిగులు/తగులు, స్టాక్ మార్కెట్లు, క్రిప్టో లాంటి వాటికి మించి అనేకానేకం తెరవెనుక ఉన్నాయి. అంకెల వెనుక ఉన్నఆస్తిని అవగాహన చేసుకుని ఆలింగనం చేసుకోవాలి. అవి విశ్వవ్యాప్త బడుగు వర్గాల సామాన్య ప్రజానీకానికి చెందినవి. ప్రపంచ ఆర్థిక, వాణిజ్య సంపదల పిరమిడ్కు భూమిక వారే. మనకు దాని శిఖరం కనిపించినంతగా దాన్ని అంతగా స్థిరంగా నిలిపే భూమిక పట్టదు. ఈ అట్టడుగు 90 శాతం మాత్రమే ఆ శిఖర పదిశాతాన్ని అక్కడ అనాదిగా కూర్చోపెడుతున్న విష యం విస్మరించరాదు. భౌగోళిక, నైసర్గిక స్థితిగతుల రీత్యా ప్రపంచంలో ఏఒక్క దేశం పూర్తిగా స్వావలంబనతో మన లేదు. ఏదో రీతిలో మానవాళి మనుగడ అంతా పరస్పర ఆధారం అన్నది తరతరాల నుండి కొనసాగుతూనే ఉంది. ఇక ముందు తప్పనిసరి. ఇందుకు ఇతోధికంగా నాగరికత, సాంకేతిక విప్లవ పరిజ్ఞానం, రవాణాలతోపాటు వాణిజ్యం కీలకపాత్ర వహించాయి. వహిస్తున్నాయి. అలాంటి వాణిజ్యంపై పడే విధానాల తాలూకు క్రీనీడలు బహురూపాల్లో జన జీవన సరళిని కాఠిన్యం గావిస్తున్నాయి. బ్రతుకు బాటను బీటలుగా మారుస్తున్నాయి. జీవనాన్నిదుర్భరం చేస్తున్నాయి. అవాంఛనీయ విధానాలతో పట్టాలు తప్పిన జీవన వాహనాలని పట్టాలెక్కించడం ఎంతైనా కష్టం. ఈ ఉపద్రవంనుండి మానవాళిని కాపాడుకునే బాధ్యత అందరిపైనా ఉంది. మరీ ముఖ్యంగా ఇందుకు కారకులైన వారిపైన అధికంగా ఉంది. వాణిజ్యం లేకుండా ఏ దేశం మనలేదు. ఈ వాణిజ్యంలో సుంకాలు తప్పనిసరి. అయితే అవి ఇరుదేశాలలోని అత్య ధిక ప్రజల ప్రయోజనాలు శాశ్వత ప్రాతిపదికన కాపాడగ లిగే విధంగా ఉండాలి. ఒకరినొకరు ఇప్పటిలాగా హరించు కునేలా ఉండరాదు. ఆర్గనైజేషన్ ఫర్ ఎకనమిక్ కోఆపరేషన్ అండ్ డెవలప్మెంట్ అంచనాల ప్రకారం70శాతం అంతర్జాతీ య వాణిజ్యం ప్రపంచ సరఫరా గొలుసుల విలువల పైనే ఆధారపడి ఉంది. వీటిలో ముడి పదార్థాలు, విడిభాగాలు, తుది ఉత్పత్తులు ప్రపంచం నాలుగు చెరగుల భిన్న రీతిలో ప్రతిదినం సరిహద్దులు దాటుతుంటాయి. దీన్నిబట్టి విదేశీ వాణిజ్య ప్రాధాన్యత ఎంతటిదో తెలుస్తుంది. ఒక్కోసారి దేశీయ పరిశ్రమల్ని విదేశీ పోటీలు నుండి కాపాడటానికి, దేశీయ వ్యవసాయ రంగంలాంటి వాటిని విదేశీ పోటీనుండి రక్షించడానికి కొన్ని దేశాలు అదనపు సుంకాలు విధిస్తాయి. ఇది ప్రపంచీకరణ పూర్తిస్థాయిలో ఉన్నా ఇంతకాలంయాంటీ డంపింగ్ డ్యూటీల పేరుతో అన్నిదేశాలు అమలుపరిచాయి. అలాగే వివిధ రూపాల్లో ఎగుమతులు ప్రోత్సాహకాలు ఇస్తుంటాయి. విదేశీ ద్రవ్యమారక నిల్వలు పెంచుకోవడానికి, ఎగుమతుల పెంపుకై ద్వైపాక్షిక ఒప్పందాలు ఏర్పరచుకుంటారు. ఇవి, ఇలాంటివి పరస్పర దేశ ప్రజలందరి, పరిశ్రమల ప్రయోజనాల రీత్యా ఆనవాయితీగా వస్తున్నవి. వాటన్నిటిని ఉన్నఫలంగా తలకిందులు మార్పులు చేయాలి అంటేఎట్లా? ఇంతవరకు ఓ సంప్రదాయంగా కొనసాగుతున్న సమస్తాన్ని ఉన్నఫలంగా మార్చడం అంటే ఈ ప్రక్రియలో అంతర్భాగాలైన ఆర్థిక వ్యవస్థలు అన్నిటిని అస్తవ్యస్తం చేయడమే.



అందునా అమెరికాకి తమ ఎగుమతులు అధిక శాతం గల మెక్సికో 78శాతం, ఇండియా 18శాతం, థాయిలాండ్ 17 శాతం, సౌత్ కొరియా 16శాతం లాంటి వాటిపై అధిక ప్రతికూల ప్రభావం ఉంటుంది. ఈ దేశాలతో పాటు అన్ని దేశాలలోనూ వీటికి ప్రత్యక్షంగా, పరోక్షంగా అనుసంధించ బడి సర్వమానవాళి బ్రతుకు భారం అవుతుంది. జీవనం గడవడం దుర్భరం అవుతుంది. ఆయా బడుగు దేశాలతో పాటు అభివృద్ధి చెందిన దేశాల్లోనూ అల్పాదాయ వర్గం, సామాన్య ప్రజానీకం వందలాది కోట్ల మంది ఉంటారు. వారందరికీ నిత్యావసరాలు ఉంటాయి. అత్యవసరాలు ఉంటాయి. మొదటివి ఆహారపదార్థాలు లాంటివి. ఆహారం పండించడానికి కావలసిన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, రసాయనాలు దేశీయంగా లభించకపోతే దిగుమ తులపై ఆధారపడటం తప్పనిసరి. వ్యవసాయఆధార పరిశ్ర మల అస్తిత్వం, భవిష్యత్తు పంట పొలాల్లోనే నిర్దిష్ట రూపం దాలుస్తుంది. అలాగే అనారోగ్యంతో రుగ్మతలపాలైన కోట్లాది మందికి అత్యవసరాలు అయిన దేశీయంగా లభించని మందులు లాంటివి అనేకం ఉంటాయి. వాటిని దిగుమతి చేసుకుతీరాలి. ఇక సమస్తరంగాలకు, వాటి కార్యకలాపాలకు ఊపిరి అయిన ఇంధనం అవసరాలుంటాయి. అవి ఏ కొన్ని దేశాలకు తప్ప అందరికీ దేశీయంగా లభ్యం కావు. ఇవన్నీ లేక వీటిలో ఏ కొన్నింటికైనా ప్రపంచ దేశాల్లో ప్రతి దేశం ఏదోరకంగా ఏదో రూపంలో మరో దేశంపై ఆధారపడక తప్పదు. అసలే ఈ సామాన్యులకు గల అంతంత మాత్రపు కొనుగోలు శక్తి, జీవన ప్రమాణాలు, ఉద్యోగ ఉపాధి అవకా శాల కొరత రీత్యా ఈ అదనపు సుంకాల భారం మూలిగే నక్కపై తాడి పండు పడినట్లే కాగలదు. వీరికి అదనంగా ప్రతి సంవత్సరం విశ్వవ్యాప్తంగా కోట్లాదిమంది కళాశాలల నుండి యూనివర్సిటీల నుండి బయటకు వచ్చి నిరుద్యోగు లుగా మిగిలిపోతున్న దిక్కుతోచని వారు అనేకులు. ఏ వస్తువు, సరుకు, పరికరాలు లాంటివి ఏవైనా వాటి ఉత్పత్తి తయారీ అంతిమ లక్ష్యం వినియోగానికే కదా!. అలాంటి వినియోగదారుడు దైనందిన ఆర్థిక విషవలయంలో చిక్కుకుంటే ఇక ఈ విదేశీ వాణిజ్యం అంతా ఏమైపోవాలి?. ఈ ప్రక్రియల పరంపరలో సమిధలయ్యే సామాన్యుల మాటేమిటి?. ఇక్కడ ఈ కొనుగోలుదారులు లేకపోతే పంపించే ఎగుమతిదారులు అక్కడఏమైపోవాలి?. ఎవరికి ఎక్కడికైనాఎలా పంపుతారు?. ఈప్రశ్నల పరంపరకి బదులు ఎవరిస్తారు? తయారీ రంగంలో అనేక పారిశ్రామిక ఉత్పత్తులు అంచలంచలుగా తయారవుతాయి. ఒక ఉత్పత్తి మరోదానికి ముడి సరుకు కాగలదు. మచ్చుకి ఆటోమొబైల్ రంగంలో ఒక వాహన తయారీలో కొన్ని వందల భాగాలుంటాయి. అవి విడివిడిగా తయారవుతాయి. విభిన్న ప్రాంతాలలో, అలాగే కంప్యూటర్లు, ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు కూడా. మరీ ముఖ్యంగా మనిషికి ముఖ్య అవసరాలైన మందులు అంతే. వాటి తయారీలో వివిధ దశలుంటాయి. ప్రతి దశలోనితుది ఉత్పత్తి అనంతరం దానికి తొలి ముడి పదార్థం కాగలదు. ఇవి ఇలాంటి వాటిలో అన్ని విభాగాలు విభిన్న దశలలో ఎక్కడికక్కడ అత్యధిక సుంకాలు పోటాపోటీగా పరస్పర దేశాలు విధించుకుంటూ పోతే అంతిమ ఉత్పత్తి ఉత్పాదక వ్యయం తడిసి మోపెడవుతుంది. తిరిగి తిరిగి అదంతా కొనుగోలు దారుడే భరించాల్సిందే. ఈ పెను భారం అసలే అంతంతమాత్రం ఆదాయంతో బతుకు భారమైన సామాన్య జనం ఈ అదనపు బరువును ఎలా భరించగలరు? ధరలు పెరగడంతో పర్యవసానంగా కొనుగోళ్లు మందగిస్తాయి. దాంతో ఉత్పత్తి తగ్గిస్తారు. ఉత్పత్తి వ్యయం పెరుగుతుంది. అమ్మకపు ధర పెరగాలి. దీనితో ద్రవ్యోల్బణంపెరుగుతుంది. పెరిగిన సుంకాల కారణంగా వినిమయ దారులు కొనలేరనే భయంతో దిగుమతిదారులు వీటికి దూరంగా ఉండే ప్రమా దం ఉంది. అప్పుడు రెండు రకాల ఉపద్రవాలు. ఒకటి వినియోగదారునికి కావలసినవి అందవు. అటుప్రభుత్వానికి అంతిమంగా అంతకుముందు వచ్చు ఆదాయం కూడా వారు ఆశించిన విధంగా రాదు. పైగా ఎగుమతిదారు ప్రత్యామ్నా య దిగుమతి దారుల కోసం అన్వేషిస్తారు. ఈ దిగుమతుల కొరతతో దేశీయ పరిశ్రమలు కుంటూబడవచ్చు. ఈ బహుముఖ విపరిణామాలు రీత్యా పోటాపోటీగా పరస్పరం పెంచుతున్న ఈ ప్రతీకార సుంకాల విషయంలో అన్ని దేశాలు సంయమనం పాటించాలి. పూర్వాపరాలు ఏకపక్షంగా కాక మానవాళి అందరివిస్తృత, దీర్ఘకాలప్రయోజనాల ప్రాతి పదికన తగు విజ్ఞతతో సమిష్టిచర్యలు సకాలంలోతీసుకోవాలి.



## జానాభా ఆధారంగా చేపట్టే
# డీలిమిటేషన్‌కు వ్యతిరేకంగా సమావేశం
### సీనియర్ నేత జానారెడ్డితో డిప్యూటీసీఎం భట్టి భేటీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి 15:** జనాభా ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన పై ముందస్తుగా జాగ్రత్త పడాల్సిన అవసరం ఉందని గత క్యాబినెట్ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ అంశంపై రాష్ట్రంలోని అన్ని పార్టీలతో మాట్లాడాలి అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లుకు, సీనియర్ నేత జానారెడ్డిలకు సీఎం సూచించారు. ఆ సూచనలో భాగంగా ఇప్పటికే రాజకీయ పార్టీలకు బహిరంగ లేఖ విడుదల చేశారు. ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకువెళ్లడంలో భాగంగా శనివారం సీనియర్ నేత జానారెడ్డితో వారి నివాసంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క భేటీ అయ్యారు. రాజకీయాలకు అతీతంగా, అన్ని పార్టీల నాయకులతో సంప్రదించి రాష్ట్ర ప్రయోజనాలు కాపాడాలని ఇరువురు చర్చించారు. ఈ కార్యక్రమాన్ని వేగవంతం చేయడంలో భాగంగా శనివారమే అన్ని పార్టీల నాయకులతో ఫోన్లో మాట్లాడి .. ఎవరికి ఇబ్బంది లేని వేదిక డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయం లేదా పూలే ప్రజా భవన్ అనే అంశాలు వారితో చర్చించి ఖరారు చేయాలని నిర్ణయించారు.

# తెలంగాణలో 3 కోట్ల కోతులు
### వాటి బెడద పరిష్కారానికి తీసుకున్న చర్యలేంటి?: హైకోర్టు ప్రశ్న

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, మార్చి 15:** అడవుల్లో ఉండాల్సిన కోతులు ఈ మధ్య జనావాసాల్లో విచ్చల విడిగా సంచరిస్తున్నాయి. తెలంగాణ పల్లెల్లో అయితే ఎక్కడ చూసిన వానర మూకలే దర్శనమిస్తున్నాయి. గుంపులు గుంపులుగా గ్రామాల్లో తిరుగుతూ ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. ఇంటి గోడలపై, చెట్లపై అటూ ఇటూ దూకుతూ నానా రచ్చ చేస్తున్నాయి. పంట పొలాలను ధ్వసం చేస్తున్నాయి. వాటిని తరిమిందేకు ప్రయత్నించిన వారిపై దాడులకు తెగబడుతున్నాయి. తెలంగాణలో 3 కోట్ల కోతులు అంచనా వేశారు. ఈ నేపథ్యంలో కోతుల బెడద నివారణకు తీసుకున్న చర్యలేంటో చెప్పాలని తెలంగాణ హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. కోతుల కారణంగా పంటలకు నష్టం వాటిల్లుతోందని.. మనుషులపై దాడులకు తెగబడుతున్నాయని తెలంగాణ రైతు సమస్యల సాధన సమితి అధ్యక్షుడు ఎం. మల్లన్న హైకోర్టుకు లేఖ రాయగా.. ఈ ప్రజా ప్రయోజన వాజ్యంపై తాత్కాలిక ప్రధాన న్యాయ మూర్తి సుజోయ్ పాల్, న్యాయమూర్తి రేణుక యారాలతో కూడిన డివిజన్ బెంచ్ విచారణ చేపట్టి ఆదేశాలు జారీ చేసింది. నాలుగు వారాల్లోగా తీసు కున్న చర్యలపై వివరణఇవ్వాలని రేవంత్ సర్కార్‌ను ప్రభుత్వం ఆదేశించింది.

# జగదీశ్‌రెడ్డిపై సస్పెన్షన్ ఎత్తివేయండి
### స్పీకర్‌కు బిఆర్ఎస్ ఎమ్మెల్యేల వినతి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి 15:** శనివారం మూడో రోజు అసెంబ్లీ సమావేశాలు మొదలవగానే బీఆర్ఎస్ సభ్యులు ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి సస్పెన్షన్ అంశాన్ని లేవనెత్తారు. జగదీష్ రెడ్డిపై సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని, ఈ అంశాన్ని స్పీకర్ పునఃపరిశీలించాలని మాజీ మంత్రి హరీష్‌రావు సభా ముఖంగా విజ్ఞప్తి చేశారు. జగదీష్ రెడ్డి తమను ఉద్దేశించి ఏకవచనంతో మాట్లాడలేదని స్పీకర్‌తో అన్నారు. స్పీకర్ అంటే తమకు గౌరవం ఉందని, జగదీష్ రెడ్డికి మాట్లాడే అవకాశం ఇస్తే బాగుండేదని హరీష్‌రావు తన అభిప్రాయాన్ని వెల్లడించారు.

# వాంటెడ్ సైబర్ నేరగాడు జుబేర్ అమ్మద్ అరెస్టు
### దుబాయ్ నుంచి వస్తుండగా శంషాబాద్‌లో పట్టివేత
### దేశవ్యాప్తంగా 124 సైబర్ నేరాల్లో నిందితుడు

**హైదరాబాద్, మార్చి 15, ప్రభాతవార్త:** దుబాయ్‌లో వుంటూ ఇండియాలో వరుసగా సైబర్ నేరాలకు పాల్పడుతూ పదుల కోట్ల రూపాయలను లూటీ చేసిన బడా సై బర్ నేరగాడు హైదరాబాద్‌కు చెందిన మహమ్మద్ జుబేర్ అహ్మద్ (31) ఎట్టకేలకు పట్టుబడ్డాడు. ఐదేళ్లకుపైగా పరారీలో వున్న ఇతను దుబాయ్ నుంచి హైదరాబాద్ కు రాగా శంషాబాద్ విమానాశ్రయంలో సిటీ సైబర్ క్రైం పోలీసులు అరెస్టు చేశారు. వివరాలు ఇలావున్నాయి. హైదరాబాద్‌లోని బహదూర్‌పురాకు చెందిన జుబేర్ అహ్మద్ ఐదేళ్లుగా సైబర్ నేరాలకు పాల్పడుతున్నాడు. ఫెడెక్స్ నేరాలు, డిజిటల్ అరెస్టులు, సిబిఐ, ఐటి, కస్టమ్స్ అధికారుల పేరిట బెదిరించి అమాయకుల నుంచి లక్షలాది రూపాయల నుంచి కోట్లాది రూపాయలను నిమిషాలలో దోచుకోవడం ఇతని ప్రత్యేకత. ఇతనికి హైదరాబాద్‌తో పాటు ముంబాయిలో కొందరు అనుచరులు వు న్నారు. వీరంతా ఇతని నేరాలలో పాలుపంచుకోవడంతో పాటు సైబర్ నేరాలలో దోపిడికి అవసరం అయ్యే నగదు బదిలీకి మ్యూల్ బ్యాంకు ఖాతాలను అందించే వా రు. జుబేర్‌పై దేశ వ్యాప్తంగా 124 కేసులుండగా ఇందులో తెలంగాణలో 24 వున్నాయి. గత ఏడాది జూలై 24వ తేదీన హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తిని డిజిటల్ అరెస్టు పేరిట దుబాయ్ నుంచి ఫోన్ ద్వారా జుబేర్ బెదిరించి 55 లక్షల రూపాయలను కాజేశాడు. దీనిపై బాధితుడి ఫిర్యాదు మేరకు సైబర్ క్రైం పోలీసులు కేసు న మోదు చేసుకుని విచారణ చేబట్టగా జుబేర్ వ్యవహారం వెలుగు చూసింది. ఈ కేసులో జుబేర్‌కు సహకరించిన నేరగాళ్లు మీర్ రజాక్ అలీ, మహమ్మద్ సయ్యిద్, దస్తగిరి షా, సాదిక్ (వీరంతా టోలిచౌకి వాసులు) అప్పట్లోనే అరెస్టయ్యారు. వీరంతా జుబేర్‌కు మ్యూల్ బ్యాంకు ఖాతాలను సమకూర్చారు. కాగా దుబాయ్‌లో వుంటున్న జుబే ర్ కోసం ఎల్‌ఓసి జారీ చేశారు. ఇదే సమయంలో ఇతని నేరాల గురించి ఆరాతీయగా పెద్ద చిట్టా రట్టయ్యింది. జుబేర్‌ను అరెస్టు చేసేందుకు ఓవైపు ప్రయత్నిస్తున్న త రుణంలో అతనే హైదరాబాద్‌కు రాగా శనివారం నాడు శంషాబాద్ విమానాశ్రయంలో పోలీసులు ఎల్‌ఓసి వుండడంతో అరెస్టు చేసి ఈ విషయాన్ని సైబర్ క్రైం పోలీ సులకు తెలిపారు. దీని తరువాత సైబర్ క్రైం పోలీసులు జుబేర్‌ను అరెస్టు చేసి అతని వద్ద వున్న రెండు సెల్‌ఫోన్లను జప్తు చేసి రిమాండుకు తరలించారు.

# పదో తరగతి విద్యార్థినిని బ్లాక్‌మెయిల్ చేసి వేధించిన తోటి విద్యార్థులు
### ముగ్గురు మైనర్లను అరెస్టు చేసిన గచ్చిబౌలి పోలీసులు

**హైదరాబాద్ (గచ్చిబౌలి), మార్చి 15, ప్రభాతవార్త:** పెరుగుతున్న టెక్నాలజీ, సెల్‌ఫోన్ల వినియోగం పెరగడంతో విద్యార్థులు అవగాహనలేమితో పలు నేరాలకు పాల్పడుతున్నారు. తాజాగా గచ్చిబౌలిలో జరిగిన ఘటన తీవ్ర చర్చనీయాంశంగా మారింది. మార్ఫింగ్ వీడియోతో 10వ తరగతి చదువు తున్న తోటి బాలికను అదే తరగతికి చెందిన బాలురు బ్లాక్‌మెయిల్ చేసి వేధించగా ఆ విషయం బాలిక తల్లిదండ్రులకు తెలిసింది. వారు బాధితురాలితో గచ్చిబౌలి పోలీసులకు ఫిర్యాదు చేయించగా, పోలీసులు కేసు నమోదు చేసుకొని ముగ్గురు బాలురను అరెస్టు చేశారు. ఘటనకు సంబంధించిన వివరాలు పోలీసుల కథనం ప్రకారం... గచ్చిబౌలిలోని ఓ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న బాలికకు అదే తరగతిలో చదువుతున్న ఓ బాలుడు స్నేహితుడయ్యాడు. ఈ క్రమంలో మార్ఫింగ్ చేసిన వీడియోతో సదరు స్నేహితుడు ఆ బాలికను బ్లాక్‌మెయిల్ చేయడంతో ఇద్దరు ప్రైవేటుగా కలుసుకున్నారు. వీరు కలుసుకున్న విషయాన్ని అదే తరగతికి చెందిన మరో బాలుడు వీడియో తీశాడు. వీడియో తెప్పించుకున్న విద్యార్థి బాలికను బ్లాక్ మెయిల్ చేసి వేధించసాగాడు. కాగా బాలికను తోటివిద్యార్థులు బ్లాక్ మెయిల్ చేయడం గమనించిన తోటి విద్యార్థినిలు బాధితురాలి తల్లి దండ్రులకు చెప్పారు. గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌లో పిర్యాదు చేయించగా, పోలీసులు ముగ్గురు మైనర్ విద్యార్థులను అరెస్టు చేశారు.

# వాస్తవాల ప్రాతిపదికపై ప్రభుత్వాన్ని నడుపుతున్నాం
### కెసిఆర్ సభలో ఉండగానే కృష్ణా జలాల వివరాలు వెలికి తీయాలి
### ఆయన సభకు రెండుసార్లు మాత్రమే హాజరై
### రూ.57 లక్షల జీతం తీసుకున్నారు: అసెంబ్లీలో సిఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, మార్చి 15, ప్రభాతవార్త :** వాస్తవాల ప్రాతిపదికపై తాము ప్రభుత్వాన్ని నడుపుతున్నామని తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. శనివారం బడ్జెట్ సమావేశాల్లో భాగంగా అసెంబ్లీ గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. 2022 బడ్జెట్ సమావేశాల సందర్భంగా గవర్నర్ ప్రసంగం లేకుండానే సమావేశాలు నిర్వహించారని సిఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. గత ప్రభుత్వం ప్రజాస్వామ్య విలువలను పాటించ లేదని అన్నారు.

మహిళా గవర్నర్‌గా తమిళిసై సౌందర్య రాజన్ బిఆర్ఎస్ సర్కార్ అవమానించి విషయం నిజం కాదా అని ప్రతిపక్షాన్ని ప్రశ్నించారు. గవర్నర్ ప్రసంగం గాంధీ భవన్ కార్యకర్త ప్రసంగంలా ఉందంటూ.. కొందరు తమ అజ్ఞానాన్ని బయట పెట్టుకున్నారన్నారు. ఎన్నికల్లో తెలంగాణ ప్రజలకు తాము మేనిఫెస్టో ఇచ్చామని.. అందులో చెప్పినవే అమలు చేస్తూ వస్తున్నామన్నారు. మంత్రివర్గం ఆమోదించిన నిర్ణయాలే గవర్నర్ ప్రసంగంలో ఉంటాయని, తమ ప్రభుత్వం విధానాన్ని గవర్నర్ సభలో చెప్పారని పేర్కొన్నారు.

**కృష్ణానది ప్రాజెక్టు వివరాలు వెలికి తీయాలి**

కృష్ణానదిపై ప్రాజెక్టుల మొత్తం వివరాలు తీయాలని సీఎం రేవంత్ అన్నారు. ఎవరి హయాంలో ఎన్ని ప్రాజెక్టులు ప్రారంభమయ్యాయి? ఎవరి హయాంలో అవి పూర్తయ్యాయి. ఎవరు అన్యాయం చేశారో చర్చిద్దామన్నారు. ఈ అంశంపై కెసిఆర్‌ను సభకు రమ్మనాలని స్పీకర్‌ను కోరారు. ఈ సభలో కేసీఆర్ ఉండగానే కృష్ణాజలాలపై చర్చ పెడదాం. తమ తప్పు ఉందని నిరూపిస్తే ఇదే సభలో కేసీఆర్‌కు, బీఆర్ఎస్ నాయకులు తాను క్షమాపణ చెప్తానన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో అనుమతులు వచ్చిన ప్రాజెక్టులను పక్కన పెట్టడం వల్ల కృష్ణా నీటి విషయంలో తెలంగాణకు కెసిఆర్ మరణశాసనం రాశారని, వారు ఏపి సిఎం చంద్రబాబుకు లోంగిపోయారని ఆరోపించారు.

**మాజీ సిఎంకు ప్రాణహాని ఉంది**

మాజీ సిఎం కెసిఆర్‌కు కుటుంబ సభ్యులతో ప్రాణహాని ఉందని, అందుకే ఆయన పోలీసుల పహార మధ్యలో ఆయన ఫ్యామిలీకి దూరంగా ఉంటున్నారని సిఎరేవంత్‌రెడ్డి హాట్ కామెంట్స్ చేశారు. గవర్నర్ ప్రసంగం గాంధీభవన్‌లో కార్యకర్త ప్రసంగంలా ఉందని కొందరు తమ అజ్ఞానాన్ని బయటపెట్టుకున్నారని ఎద్దేవా చేశారు. వారు తమ అజ్ఞానమే గొప్ప విజ్ఞానంగా, తెలివితక్కువ తనమే తమ గొప్పతనంగా అనుకుంటున్నారని మండిపడ్డారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేశామని, వాటినే గవర్నర్ తన ప్రసంగంలో ప్రస్తావించారన్నారు. ప్రజాస్వామ్యం,ప్రభుత్వాలు ఏ ఒక్క వ్యక్తి సొంత ఆస్తి కాదని స్పష్టంచేశారు.

**కెసిఆర్ సభకు రెండు సార్లు వచ్చి రూ.57,84,124 జీతం తీసుకున్నారు**

ప్రతిపక్ష నాయకుడిగా కేసీఆర్ ఈ సభకు రెండు సార్లే వచ్చారని సీఎం వెల్లడించారు. డిసెంబర్ 2023 నుంచి ఇప్పటి వరకు రూ.57,84,124 జీతభత్యాలు తీసుకున్నారని వివరించారు. ప్రభుత్వ జీతభత్యాలు తీసుకుంటూ తెలంగాణ ప్రజలను వారి ఖర్మకు వదిలేసిన ప్రధాన ప్రతిపక్ష నాయకుడు వారి పార్టీ నాయకులను ఇలా తయారు చేసి పంపించారన్నారు. బిఆర్ఎస్ నేతలు రేబిస్ వ్యాక్సిన్ వికటించినట్లుగా ప్రవర్తిస్తున్నారని ఫైర్ అయ్యారు. ప్రజాశ్రేయస్సు కోసం విపక్షాలు సూచనలు చేస్తే స్వీకరిస్తామని సిఎం తెలిపారు.

**కెసిఆర్ నిండు నూరేళ్లు ఉండాలి**

బిర్ఎస్‌కు ఫ్యూచర్ లేదని అది ప్రస్తుతం మా మార్చురీలో ఉందని అన్న మాట వాస్తవమేనని. అందులో తప్పేముందని సమర్థించుకున్నారు. తాను కెసిఆర్‌ను కించపరిచినట్లుగా కెటిఆర్, హరీశ్ రావు విమర్శిస్తున్నారని.. కేసీఆర్ వందేళ్లు జీవించి ప్రతిపక్షంలోనే ఉండాలని తాను కోరుకుంటున్నానని అన్నారు. అంతకు ముందు గవర్నర్ ప్రసంగానికి నిరసనగా సభ నుంచి బిఆర్ఎస్ సభ్యులు వాకౌట్ చేశారు.

# 24 గంటల్లో 11వేల మందికి రొమ్ము కేన్సర్‌పై అవగాహన!
### రెండుసార్లు గిన్నిస్ రికార్డు పొందడం అభినందనీయం
### మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

**హైదరాబాద్ (బేగంపేట) మార్చి 15, ప్రభాతవార్త:** 50వ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా 24 గంటల్లో 11వేల మందికి రొమ్ము కేన్సర్‌పై అవగాహన కల్పించడం ద్వారా గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్స్ రికార్డ్స్ నుంచి రెండు రికార్డులు సాధించడం అభినందనీయం అని మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు అన్నారు. నగరానికి చెందిన ఉషాలక్ష్మి బ్రెస్ట్ కేన్సర్ ఫౌండేషన్, కిమ్స్ ఉషాలక్ష్మి సెంటర్ ఫర్ బ్రెస్ట్ డిసీజెస్ బ్రహ్మకుమారీస్‌తో కలిసి యూట్యూబ్‌లో సరికొత్త రికార్డు నెలకొల్పాయి. ఇది 24 గంటల్లోనే రెండో గిన్నిస్ ప్రపంచరికార్డు కావడం విశేషం. గిన్నిస్ ప్రపంచ రికార్డు బహూకరణను ప్రపంచ వ్యాప్తంగా 6,218 మంది యూట్యూబ్‌లో చూసి ప్రయోజనం పొందారన్నారు. సికిందరాబాద్ కిమ్స్ ఆస్పత్రిలో గిన్నిస్ వరల్డ్ రికార్డు (జీడబ్ల్యూ ఆర్)ను సమర్పించిన ఈవెంట్‌ను ఆసియా ఫసిఫిక్ జడ్జి రిషీనాథ్ 40 నిమిషాలకుపైగా స్పష్టమైన ప్రెజంటేషన్ ఇచ్చిన డాక్టర్ రఘురామ్‌ను అభినందించారు. రొమ్ము కేన్సర్ నిర్ధారణ అయిన ప్రతి ఇద్దరు మహిళల్లో ఒకరు భారతదేశంలోనే ఉన్నారని ఆందోళన వ్యక్తం చేసారు. డాక్టర్ రఘురామ్ కొన్నేళ్లుగా తెలుగు రాష్ట్రాల్లో నర్వా ర్తిదాయకమైన రొమ్ము కేన్సర్‌పై ప్రచారం చేస్తున్నారన్నారు. అనేక వినూత్న కార్యక్రమాల ద్వారా రొమ్ము కేన్సర్‌ను ముందుగానే గుర్తించాల్సిన ఆవశ్యకతపై అవగాహన కల్పిస్తున్నారని అన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోని 4,000 గ్రామాల్లో పెద్దఎత్తున జనాభా ఆధారిత రొమ్ము కేన్సర్ స్క్రీనింగ్ కార్య క్రమంతో డాక్టర్ రఘురామ్ చేపట్టిన అనేక కార్య క్రమాలు ఈ ప్రాంతంలో అనేకమంది ప్రాణాలను కాపాడానికి బాటలు వేసాయన్నారు. రొమ్ము కేన్సర్, ఇతర రొమ్ము ఆరోగ్య సమస్యల నిర్వ హణకు అంకితమైన సర్జన్‌గా రఘురామ్ చేసిన మార్గదర్శక కృషిని తాను అభినందిస్తు న్నానన్నారు. ఈ కార్యక్రమం గురించి డాక్టర్ రఘు రామ్ మాట్లాడుతూ ఈ గుర్తింపును తన తల్లి ఐదు నెలల క్రితం ఈ ప్రపంచాన్ని వదిలేసిన రొమ్ము కేన్సర్ విజేత డాక్టర్ ఉషాలక్ష్మికి అంకితం చేస్తున్నా నన్నారు. రొమ్ము కేన్సర్ గురించి బ్రహ్మకుమారీస్ కేంద్రంలో ప్రభావవంతమైన వినూత్న ప్రచారం చేయడానికి ఆమె ప్రధానస్ఫూర్తి అన్నారు. ఈ కా ర్యక్రమంలో కిమ్స్ గ్రూపు ఆఫ్ హాస్పిటల్స్ ఛైర్మన్ బి.భాస్కరరావు, ఆస్కి ఛైర్మన్ కె.పద్మ నాభయ్య తదితరులు రఘురామ్‌ను అభినందించారు.



ఉషాలక్ష్మి బ్రెస్ట్ కేన్సర్ ఫౌండేషన్‌కు వచ్చిన గిన్నిస్‌రికార్డు సర్టిఫికెట్‌ను మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడికి చూపించిన దృశ్యం

# ఎస్‌టిఎఫ్‌లను మరిన్ని ప్రాంతాలకు విస్తరించాలి
### ఎక్సైజ్‌శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాహసన్ రెడ్డి

**హైదరాబాద్, మార్చి 15, ప్రభాతవార్త:** ఎస్‌టిఎఫ్‌లను మరిన్ని ప్రాంతాలకు విస్తరించాలని, పోలీసులకు దీటుగా తనిఖీలు, దాడులు ముమ్మరం చేయాలని ఎక్సైజ్‌శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాహసన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. హెచ్‌టిఎఫ్ టీమ్‌ల సమీక్షా సమావేశం శనివారం నాంపల్లిలోని ఆబ్కారి భవన్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఎక్సైజ్‌శాఖ ఎన్ ఫోర్స్ మెంట్‌లో పని చేస్తున్న నాలుగు ఎస్‌టిఎఫ్ (స్టేట్ టాస్క్ ఫోర్స్) టీమ్‌లు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో ముమ్మరంగా తనిఖీలు చేపట్టి డ్రగ్స్, గంజాయి, నాన్‌డ్యూటి పెయిడ్ లిక్కర్, ఆల్ప్రాజోలం, నాటుసారా తయారీ,అమ్మకాలు, వినియోగాలపై ప్రత్యేక దృష్టి సారించి మంచి ఫలితాలను తీసుకు రావాలన్నారు. ఫిబ్రవరి నెలలో ఏ టీమ్‌లో 14 కేసులు, బీ టీమ్ 36 కేసులు, సీ టీమ్ 11, డీ టీమ్ 13 కేసులు నమోదు చేశాయని, మొత్తం 76 కేసులు నమోదు చేసి 212 లీటర్ల నాటుసారాను, 5000 కేజీల నల్లబెల్లాన్ని, 111 కేజీల గంజాయిని, 24 వాహనాలను సీజ్ చేసినట్లు ఈ సందర్భంగా అధికారులు వివరించారు. జిహెచ్‌ఎంసితో పాటు రాష్ట్రంలో జరుగుతున్న క్రైమ్‌పై ప్రత్యేకంగా టీమ్ లీడర్లు నిఘా పెట్టాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాహసన్ రెడ్డి సూచించారు. అదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల, వరంగల్, కరీంనగర్ ప్రాంతాల్లో ఐటీ లిక్కర్‌తోపాటు, ఎన్‌డీపీఎల్ లిక్కర్‌పై వినియోగంపై దృష్టి పెట్టాలని అదేశించారు. నిజామాబాద్, మహబూబ్‌నగర్, మెదక్ ప్రాంతాల్లో ఆల్ప్రాజోలం వినియోగంపై నిఘాపెట్టాలన్నారు. ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అదేశాల మేరకు ప్రత్యేక టీమ్‌లతో దాడులు నిర్వహించాలన్నారు.

గంజాయి, డ్రగ్స్ ఎలా వస్తున్నాయి, ఎక్కడి వెలుతున్నాయనే విషయాలపై టీమ్ లీడర్లు పరిశీలించి రవాణ ప్రాంతాలపై దాడులు నిర్వహించాలని కోరారు. ఈ సమావేశంలో జాయింట్ కమిషనర్ ఖురేషీ, అడిషనల్ ఎస్పీ భాస్కర్, అసిస్టెంట్ కమిషనర్ ప్రణవిలు, సీఐ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్‌టిఎఫ్‌లోని ఏ,బి,సి,డి,టీమ్ లీడర్లు నంద్యాల అంజిరెడ్డి, ప్రదీప్‌రావు, తుల శ్రీనివాసరావు, తిరుపతి యా దవ్‌లు తాము సాధించిన విజయాలపై వివరించారు.

# గ్రూప్1పరీక్షల్లో తెలుగు మీడియం విద్యార్థులకు అన్యాయం
### ప్రసన్న హరికృష్ణ

**హైదరాబాద్, మార్చి 15,ప్రభాతవార్త:** రాష్ట్రంలో జరిగిన గ్రూప్ పరీక్షల్లో అన్ని అవకతవకలే ఉన్నాయని తెలుగు మీడియం విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరిగిందని ఇటీవల కరీంనగర్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీకి పోటీచేసిన అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రసన్న హరికృష్ణ ఆరోపించారు. మార్చి 10న వచ్చిన గ్రూప్1 మెయిన్స్ ఫలితాలను ఒక సామాన్య పౌరుడికి చూపించినా తప్పులు వెలుగులోకి వస్తాయన్నారు. ప్రభుత్వం చర్యల వల్ల సంవత్సరాల తరబడి పరీక్షల కోసం సన్నద్ధమైన నిరుద్యోగులకు తీరని అన్యాయం జరిగిందన్నారు. గ్రూప్ 1, 2, 3 పరీక్షా ఫలితాలను వెల్లడించిన నేపథ్యంలో గ్రూప్ 2, 3లో జీఆర్ఎల్‌ను స్పష్టంగా ప్రకటించిన ప్రభుత్వం, గ్రూప్ 1లో ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. జీఆర్ఎల్ ఇచ్చి పబ్లిక్ డొమైన్‌లో పెడితే ఎవరికి ఎన్ని మార్కులు వచ్చాయో తేటతెల్లమయ్యేదని దీని వెనుక కుట్ర జరిగినట్లు తెలుస్తోందని విమర్శించారు. ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన ప్రెస్‌రిలీజ్‌లో సైతం జీఆర్ఎల్ ప్రస్తావన రాలేదనిఇందులో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు.

గ్రూప్ 1 మెయిన్స్ ప్రశ్నాపత్రాలను ఎవరితో దిద్దించారన్న విషయాన్ని కూడా ప్రజలకు చెప్పాలన్నారు. పేపరు దిద్దే వ్యక్తుల అర్హతలు, బ్యాక్‌గ్రౌండ్ ఏమిటనేది బహిర్గతం చేయాలన్నారు. ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లతో దిద్దించామని చెబుతున్న ప్రభుత్వం వారికిచ్చిన బ్లూ ప్రింట్‌లో ఎంత మేరకు శాస్త్రీయత ఉందో వివరించాలన్నారు.

తెలుగు మీడియం విద్యార్థుల కోసం తయారు చేసిన బ్లూ ప్రింట్ గూగుల్‌లో ట్రాన్స్‌లేట్ చేసినదిగా తెలిసిందని తద్వారా ఆవిద్యార్థులకు ఏం న్యాయం జరుగుతుందని తాము అడిగిన ప్రతి ప్రశ్నకు సమాధానం చెప్పాలన్నారు. ఆంధ్రా ప్రాంతానికి చెందిన ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్లతో పేపర్లు దిద్దించారన్న సమాచారం తమ వద్ద ఉందన్న ఆయన టాప్ 100 మందిలో ఎంత మంది ఇంగ్లీషు, తెలుగు, ఉర్దూ మీడియం విద్యార్థులు ఉన్నారో చెప్పాలన్నారు. ముఖ్యంగా ఈ టాప్ 100 విద్యార్థుల ప్రశ్నాపత్రాలను ఎక్స్‌పర్ట్ కమిటీ వేసి మరోసారి దిద్దించాలని డిమాండ్ చేశారు.

# వ్యవసాయ రంగాన్ని విస్మరిస్తోన్న సర్కారు
### డెడికేటెడ్ కమిషన్ నివేదికను ప్రభుత్వం ఎందుకు దాచిపెడుతోంది?
### మండలిలో గవర్నర్ ప్రసంగంపై బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత

**హైదరాబాద్, మార్చి 15, ప్రభాతవార్త:** గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై శాసనమండలిలో శనివారం జరిగిన చర్చలో బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ ప్రజల మనోభావాలు దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో రేవంత్ రెడ్డి లేరు కాబట్టి.. ప్రజల మనోభావాలను అనుగుణంగా ఆయన నిర్ణయాలు ఉండడం లేదన్నారు. రాష్ట్రంలో రికార్డు స్థాయిలో వరి పండిందని గవర్నర్ తన ప్రసంగంలో అన్నారని, కాళేశ్వరం ప్రాజెక్టు వల్లనే 2.6 కోట్ల మెట్రిక్ టన్నుల వరి పండిందని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు ముందు కేవలం 64 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే పండేదని గుర్తుచేశారు. పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో ఏం జరిగిందో చెప్పడానికి ఇదే నిదర్శనమన్నారు. వ్యవసాయ రంగాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు విస్మరిస్తోందని ప్రశ్నించారు. కాళేశ్వరంలోని మేడిగడ్డను బూచీగా చూపించి.. మొత్తం తెలంగాణ పంటలను ఎండబెట్టడం సబబు కాదన్నారు. రైతులు పంటలను కాలపెట్టుకునే బాధాకర పరిస్థితులు ఏర్పడ్డాయని ఆందోళన వ్యక్తం చేశారు. కేసీఆర్ చెరువులు నింపడం వల్ల భూగర్భ జలాలు 7 మీటర్ల మేరా పెరిగాయని.. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం సాగునీటి కల్పనలో పూర్తిగా విఫలమైందన్నారు. ఇప్పటికీ రాష్ట్రంలో సంపూర్ణంగా రుణమాఫీ కాక అనేక రైతు కుటుంబాలు బాధ పడుతున్నాయన్నారు కవిత. రూ 50 వేల కోట్లు ఖర్చు చేస్తేనే రైతులందరికీ రూ. 2 లక్షల రుణమాఫీ పూర్తవుతుందని.. కానీ కేవలం రూ. 20 వేల కోట్లతో రుణమాఫీ పూర్తి చేశామని చెప్పించి గవర్నర్‌ను కూడా తప్పుదోవపట్టించారని మండిపడ్డారు. సన్న వడ్లకు బోనస్ బోగస్ అయిందని, రాష్ట్రంలో అత్యధిక రైతులకు బోనస్ రాలేదన్నారు.

మహాలక్ష్మీ పథకాన్ని గేమ్ చేంజర్‌గా అభివర్ణించడం హాస్యాస్పదమన్నారు. మూడు నాలుగు పథకాల సమూహామైన మహాలక్ష్మీ పథకాన్ని పాక్షికంగా అమలు చేసి .. పూర్తిగా అమలు చేశామని చెప్పడం అర్ధసత్యమేనని విమర్శించారు. అబద్ధం కంటే అర్ధసత్యం చాలా ప్రమాదకరమన్నారు. కళ్యాణ లక్ష్మీ కింద తులం బంగారం ఇవ్వకుండానే మహా లక్ష్మీ పథకం ఎలా పూర్తిగా అమలవుతున్నట్లు? అని ప్రశ్నించారు. కేసీఆర్ హయాంలో కూడా ఆరోగ్యశ్రీ మొత్తాన్ని రూ.5 లక్షలకు పెంచడం జరిగిందని, ప్రభుత్వ ఆస్పత్రులను కూడా కేసీఆర్ బలోపేతం చేశారని గుర్తుచేశారు. కానీ ఈ కాంగ్రెస్ ప్రభుత్వం.. ప్రభుత్వ ఆస్పత్రులను పట్టించుకోవడం లేదని, ప్రభుత్వ ఆస్పత్రుల్లో సూది లేదు.. దూది లేదు.. మందులు అసలే లేని పరిస్థితి ఏర్పడిందన్నారు. బిసి రిజర్వేషన్లకు సంబంధించి డెడికెటెడ్ కమిషన్ నివేదికను ప్రభుత్వం ఎందుకు దాచిపెడుతోందని ప్రశ్నించారు. డెడికెటెడ్ కమిషన్‌తో పాటు ఎస్సీ వర్గీకరణపై షమీమ్ అఖ్తర్ కమిషన్ నివేదికలను ప్రభుత్వం ఎందుకు అసెంబ్లీలో పెట్టడం లేదని ప్రశ్నించారు. సర్వే ద్వారా సేకరించిన వివరాల్లో కులాల వారీగా, గ్రామాల వారీ వివరాలను ఎందుకు బహిర్గతం చేయడం లేదన్నారు. పరిశ్రమలు తెలంగాణ నుంచి తమిళనాడు, గుజరాత్‌కు తరలివెళ్తున్నట్లు వార్తలు వస్తున్నాయని, ఈ అంశంపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలన్నారు. జయజయహే తెలంగాణ గీతానికి ఆంధ్రా వ్యక్తితో సంగీతం ఇప్పించడం సరికాదని, తెలంగాణలో సంగీత దర్శకులు లేరా? అని ప్రభుత్వాన్ని నిలదీశారు.



# ఉమన్ ప్రీమియర్ విజేతగా ముంబయి జట్టు!
### 8 పరుగుల తేడాతో ఢిల్లీజట్టు ఓటమి

**ముంబయి, మార్చి 15:** మహిళాప్రీమియర్‌లీగ్ విజేతగా ముంబయి జట్టు గెలిచింది. ఢిల్లీ జట్టుతోజ రిగిన ఫైనల్ మ్యాయచ్‌లో 8 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. రెండోసారి ముంబయి జట్టు డబ్ల్యుపిఎల్ టైటిల్‌ను సాధించింది. 150 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఢిల్లీజట్టు 9 వికెట్ల నష్టానికి 141 పరుగులకు పరిమితం అయింది. రోడ్రిగ్స్ 30, మరిజేన్‌కాప్40 మినహా పెద్దగా ఎ వ్వరూరాణించలేదు. ముంబయి బౌలర్లలోబ్రంట్3 వికెట్లు తీయగా అమీలియా కెర్ రెండు, ఇస్మాయిల్, మాథ్యూస్, ఇషాక్యూ చెరొక వికెట్‌తీసారు. దీనితో డబ్ల్యుపిఎల్‌చరిత్రలో వరుసగా మూడోసారి ఫైనల్‌కువెళ్లి విజయం సాధించలేని జట్టుగా ఢిల్లీ జట్టునిలిచింది. లక్ష్యఛేదనకు దిగిన ఢిల్లీకి ఆదిలోనే ఎదురుదెబ్బ తగిలింది. మూడు ఓవర్లలోపే ఓపెనర్లు మెగ్ లాన్నింగ్13, షెఫాలీవర్మ నాలుగు పెవిలియన్‌కు చేరారు. బ్రంట్‌బౌలింగ్‌లో లాన్నింగ్ బౌల్డ్‌కాగా ఇస్మాయిల్‌వేసిన మూడో ఓవర్‌చివరి బంతికి వర్మ వికెట్లముందు దొరికిపోయింది. ఇక జోనాసేన్ 13, ఇన్నింగ్స్ చేసినా అమీలియా కెర్‌బౌలింగ్‌లో భాటియాకు క్యాచౌట్ అయింది. రోడ్రిగ్స్‌కూడా జట్టుస్కోరు66 పరుగులవద్ద కెర్‌బౌలింగ్‌లోనే క్యాట్ అండ్‌బౌల్డ్‌గా వెనక్కిపోయింది. జట్టు ఒక్కసారిగా కష్టాల్లోపడింది. చివరిలో మరిజేన్‌కాప్ 40, నికీప్రసాద్ 25 జట్టును విజయతీరాలకు చేర్చేందుకు ప్రయత్నించినా సాధ్యంకాలేదు. అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ముంబయి నిర్ణీత 20 ఓవర్లలో ఏడు వికెట్లనష్టానికి 149 పరుగులుచేసింది. హార్మన్‌ప్రీత్‌కౌర్ 44 బంతుల్లో తొమ్మిది ఫోర్లు, రెండు సిక్స్‌లతో 66 పరుగులుచేసి కెప్టెన్ ఇన్నింగ్స్‌తో ఆకర్షించింది. నాట్‌సీవర్30 పరుగులుచేస్తే కమిలిని 10, అమన్‌జోత్‌కౌర్14, సంస్కృతి గుప్తా ఎనిమిది పరుగులుచేసారు.



# అమెరికాలో టోర్నడోల బీభత్సం
### పదిమందికిపైగా మృతి

**వాషింగ్టన్, మార్చి 15:** అమెరికాను పెనుతుపాను వణికిస్తోంది. పెద్దఎత్తున టోర్నడోలు విరుచుకుపడుతున్నాయి. దుమ్ముధూళితోకూడినబలమైన గాలులు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ఆయా రాష్ట్రాల్లో 100కుపైగా కార్చిచ్చులు చెలరేగాయి ప్రతికూల వాతావరణపరిస్థితుల కారణంగా ఒక్క మిస్సోరిలోనే ఇప్పటివరకూ పదిమందికిపైగా మృతిచెందినట్లు సమాచారం. టెక్సాస్ పాన్ హ్యాండిల్‌లోని అమరిల్లో కౌంటీలో కూడా మరో ముగ్గురు మృతిచెందారు. అర్కన్సాస్‌లోనూ ముగ్గురు మృతిచెందితే 29 మందికి గాయాలయ్యాయి. మిస్సోరీలో టోర్నడోలు బెంబేలెత్తిస్తున్నాయి. స్థానికంగా పలు భవనాలు కూడా దెబ్బతిన్నాయి. అలబామా, కెంటకీ, మిసిసిపీ, టెన్నసీ, ఇల్లినాయిస్, ఇండియానా, టెక్సాస్, టెన్నెసీ రాష్ట్రాలక కూడా ఈ టోర్నడోల ముప్పు పొంచి ఉందని జాతీయ వాతావరణసేవల విభాగం హెచ్చరికలుచేసింది. కెనడా సరిహద్దునుంచి టెక్సాస్‌వరకూ గంటకు 130 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందనిఅ ంచనా. ఓక్లహోమా, మిస్సోరి, న్యూమెక్సికో,టెక్సాస్, కన్సాస్‌లలో కార్చిచ్చులు చెలరేగాయి. దీనితో ఆప్రాంతాలనుంచి నివాసితులందరూ ఖాళీచేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి.

# రాజ్యాధికారమే అంతిమ లక్ష్యంగా బిసిలు ఉద్యమించాలి
### ఎంపి ఆర్.కృష్ణయ్య పిలుపు

**హైదరాబాద్, మార్చి 15, ప్రభాతవార్త:** బీసీలు రాజ్యాధికారం సాధించడమే అంతిమ లక్ష్యయంగా ఉద్యమించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య పిలుపునిచ్చారు. ఓబీసీ డెమోక్రటిక్ జేఏసీ నేత కోల జనార్ధన్ అధ్యక్షతన శనివారం కాచిగూడలో అఖిలపక్ష పార్టీలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. పిసిసి మాజీ అధ్యక్షుడు, మాజీ ఎంపి వి.హనుమంతరావు, బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరవింద్‌కుమార్ గౌడ్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ నేతలు గుజ్జ కృష్ణ, గుజ్జ సత్యం తదితరులు పాల్గొని ప్రసంగించారు. జనాభా ప్రాతిపదికన బీసీలకు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా రావాల్సిన వాటా మర్యాదగా ఇవ్వాలని, లేని పక్షంలో యుద్ధమే జరుగుతుందని హెచ్చరించారు. బీసీలకు స్థానిక సంస్థలలో 42 శాతం రిజర్వేషన్ల కోసం చేపట్టనున్న బీసీ బిల్లుకు అన్ని పార్టీలు పూర్తిస్థాయిలో మద్దతు పలకాలని, లేని పక్షంలో ఆయా పార్టీలకు బీసీలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టి చట్టసభలలో బీసీలకు 50శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. మహిళా బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోటా కల్పించాలన్నారు. దేశ జనాభా గణనలో బీసీ కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు.

### ఇంగ్లండ్ చాంపియన్‌షిప్‌లో..

# ముగిసిన భారత్ పోరు

## క్వార్టర్ ఫైనల్‌కే కూలిన ఆశలు

### లక్ష్యసేన్, గోపీచంద్, గాయత్రీ, త్రిసా ఔట్

**న్యూఢిల్లీ:** బ్యాడ్మింటన్‌లో అత్యంత పురాతన, ప్రతిష్టాత్మక టోర్నీ అయిన ఆల్ ఇంగ్లండ్ చాంపియన్‌షిప్‌లో భారీ అంచనాలతో బరిలోకి దిగిన భారత్ ఆశలు క్వార్టర్ ఫైనల్‌లోనే అడియాశల



య్యాయి. స్టార్ షట్లర్లంతా ఆరంభ రౌండ్లలోనే నిష్క్రమించినా, పురుషుల సింగిల్స్‌లో క్వార్టర్స్ చేరిన లక్ష్య సేన్‌తో పాటు మహిళల డబుల్స్‌లో గాయత్రి గోపీచంద్-త్రిసా జాలీ పోరాటం కూడా ముగిసిపోయింది. దీంతో ప్రతిష్టాత్మక ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ నుంచి వరుసగా 24వ ఏడాది భారత క్రీడాకారులు టైటిల్ లేకుండానే తిరిగి రానున్నారు. భారత్ నుంచి ఐదు విభా గాల్లో కలిపి మొత్తం 17 మంది క్రీడాకారులు ఈ మెగా టోర్నీలో బరిలోకి దిగగా ఒక్కరు కూడా క్వార్టర్ ఫైనల్ దాటి ముందు కెళ్లలేకపోయారు. సంచలన విజయాలతో ఆశలు రేకెత్తించిన లక్ష్య సేన్, పుల్లెల గాయత్రి-ట్రెసా జాలీ పోరాటం క్వార్టర్ ఫైనల్లోనే ఆగిపోయింది. చివరిగా బర్మింగ్‌హామ్‌లో జరిగిన పురుషుల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 15వ ర్యాంకర్ లక్ష్య సేన్ 10-21, 16-21తో ఆరో ర్యాంకర్ లీ షి ఫెంగ్ (చైనా) చేతిలో ఓడిపోయాడు. ప్రిక్వార్టర్ ఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్ జొనాథన్ క్రిస్టీ (ఇండోనేసియా)ను ఓడించిన లక్ష్య సేన్ క్వార్టర్ ఫైనల్లో అదే ఫలితాన్ని పునరావృతం చేయడంలో విఫలమయ్యాడు. మరోపక్క మహిళల డబుల్స్‌లో 2022, 2023లలో సెమీఫైనల్ చేరిన పుల్లెల గాయత్రి-ట్రెసా జాలీ (భారత్) జోడీ ఈసారి క్వార్టర్ ఫైనల్లో 14-21, 10-21తో రెండో సీడ్ లియు షెంగ్షు-టాన్ నింగ్ (చైనా) జంట చేతిలో ఓడింది. ప్రిక్వార్టర్ ఫైనల్లో గాయత్రి-ట్రెసా జోడీ 15-21, 21-18, 21-18తో ఎనిమిదో సీడ్ కిమ్ హైజియోంగ్-కాంగ్ హీయోంగ్ (కొరియా) జంటను ఓడించిది. క్వార్టర్ ఫైనల్లో ఓడిన లక్ష్య సేన్‌కు 7,975 డాలర్లు (రూ.6 లక్షల 93 వేలు), గాయత్రి-ట్రెసాలకు 9,062 డాలర్లు (రూ.7 లక్షల 87 వేలు) ప్రైజ్ మనీగా లభించాయి. కాగా గతంలో భారత్ నుంచి ప్రకాశ్ పదుకొనే (1980లో), పుల్లెల గోపీచంద్ (2001లో) మాత్రమే ఆల్ ఇంగ్లండ్ ఓపెన్ టైటిల్స్ సాధించారు. అలాగే 2015లో సైనా నెహ్వాల్, 2022లో లక్ష్య సేన్ ఫైనల్ చేరుకున్నా రన్నరప్ ట్రోఫీలతో సరిపెట్టుకున్నారు. ఈ సారి క్వార్టర్ ఫైనల్‌కే భారత్ షట్లర్లు ఇంటిదారి పట్టారు.




### ఛాంపియన్స్ ట్రోఫీ విజయం:

# కెప్టెన్‌గా రోహిత్ కొనసాగింపు

**న్యూఢిల్లీ:** టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మకు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ప్రమోషన్ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ 2025లో భారత జట్టును విజేతగా నిలబెట్టడంతో ఇంకొన్నాళ్లు రోహిత్‌నే కెప్టెన్‌గా కొనసాగించాలని నిర్ణయించినట్లు సమాచారం. ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ 2025 విజయా నంతరం అతడు అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలుకుతాడని జోరుగా ప్రచారం జరిగింది. కానీ ఈ ఊహాగానాలకు రోహిత్ చెక్ పెట్టాడు. తాను వన్డే ఫార్మాట్‌కు వీడ్కోలు పలకడం లేదని, వదంతులు వ్యాప్తి చేయవద్దని కోరాడు. మరోవైపు గతేడాది ఆస్ట్రేలియాతో బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో దారుణంగా విఫలమైన రోహిత్ ఆఖరి టెస్ట్ తుది జట్టు నుంచి స్వయంగా తప్పుకున్నాడు. దాంతో రోహిత్ టెస్ట్ కెరీర్ ముగిసిందని, ఇంగ్లండ్ పర్యటనకు అతను దూరంగా ఉంటాడని కూడా ప్రచారం జరిగింది. జస్‌ప్రీత్ బుమ్రానే టీమిం డియా టెస్ట్ టీమ్ నడిపిస్తాడని అంతా భావిం చారు. కానీ ఛాంపియన్స్ ట్రోఫీ విజయం నేప థ్యంలో రోహిత్‌నే కెప్టెన్‌గా కొనసాగించాలని బీసీసీఐ భావిస్తున్నట్లు తెలుస్తోంది. బుమ్రా ఫిట్‌నెస్ సమస్యలతో బాధపడుతుండటం కూడా ఇందుకు కారణంగా తెలుస్తోంది. అంతేకాకుండా ఛాంపియన్స్ ట్రోఫీ 2025లో రోహిత్ శర్మ మెరు గ్గా రాణించాడు. దాంతో ఇంకొన్నాళ్లు రోహిత్‌నే టెస్ట్ కెప్టెన్‌గా కొనసాగించాలని సెలెక్టర్లు నిర్ణయించారట.

# రిచ్ లీగ్‌కు కెప్టెన్స్ ఫైనల్

### ఐదు టీమ్‌లకు కొత్త సారథులు

### టైటిల్ పోరులో 10 జట్లు

### మరో వారంలో ఐపిఎల్ ప్రారంభం



**న్యూఢిల్లీ:** ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన లీగ్‌లో రెండవది అయిన ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)-2025వ సీజనుకు కౌంట్ డౌన్ ప్రారంభమైంది. ఈ నెల 22న క్యాష్ రిచ్ లీగ్ 18వ ఎడిషన్‌కు తెరలేవనుంది. ఎప్పటిలాగే ఈ ఏడాదీ ఐపీఎల్‌లో పది ఫ్రాంచైజీలు తలపడనున్నాయి. ఇప్పటివరకు మొత్తం తొమ్మిది ఫ్రాంచైజీలు తమ సారథులను ఖరారు చేయగా, ఢిల్లీ క్యాపిటల్స్ ఒక్కటే బ్యాలెన్స్ ఉండేది. అయితే ఇప్పుడు ఆ ఫ్రాంచైజీ కూడా తమ కొత్త కెప్టెన్‌గా అక్షర్ పటేల్ పేరును తాజాగా ప్రకటించింది. కేఎల్ రాహుల్, ఫాఫ్ డుప్లెసిస్ వంటి అనుభవజ్ఞులు జట్టులో ఉన్నప్పటికీ క్యాపిటల్స్ యాజమాన్యం మాత్రం అక్షర్‌కే పట్టం కట్టింది. ఐపీఎల్ వేలానికి ముందు జట్లు అట్టిపెట్టుకున్న ఆటగాళ్లలో అక్షర్‌ను ఢిల్లీ రిషభ్ పంత్‌ను వదిలేసి మరీ టాప్ రిటెన్షన్ కింద రూ.16.50 కోట్లతో రిటైన్ చేసుకున్నప్పుడే ఈ సీజన్‌లో అతడు సారథిగా ఉంటాడన్న వార్తలు వచ్చాయి. 2019 సీజన్ నుంచి ఢిల్లీకి ఆడుతున్న అక్షర్ 6 సీజన్లలో 82 మ్యాచ్‌లు ఆడి 967 పరుగులు చేయడమే గాక 62 వికెట్లు పడగొట్టాడు. దీంతో అన్ని జట్లు కెప్టెన్ల విషయంలో ఒక స్పష్టత వచ్చినట్లయింది. అయితే ఈసారి ఈ పది జట్ల కెప్టెన్ల విషయంలో ఒక ప్రత్యేకత ఉంది. ఈ జట్లను నడిపించే కెప్టెన్లలో ఒక్క జట్టుకు మినహా మిగిలిన టీమ్‌లన్నింటికీ అంటే 10లో 9 జట్లను నడిపించేది భారతీయ క్రికెటర్లే కావడం విశేషం. ఒక్క సన్ రైజర్స్ హైదరాబాద్ ఫ్రాంచైజీ మినహా మిగిలిన జట్ల కెప్టెన్లు భారతీయులే. కాగా ఈ సీజన్‌లో ఫ్రాంచైజీలు ఐదు జట్లను కొత్త కెప్టెన్లతో బరిలోకి దిగుతున్నాయి. లక్నో సూపర్ జెయింట్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, పంజాబ్ కింగ్స్, కోల్‌కతా నైట్ రైడర్స్, ఢిల్లీ క్యాపిటల్స్ జట్లకు సంబంధించిన ఫ్రాంచైజీ యాజమాన్యాలు ఈ ఎడిషన్‌కు కొత్త కెప్టెన్లను నియమించాయి. ఢిల్లీకి అక్షర్ పటేల్, లక్నోకు రిషబ్ పంత్, బెంగుళూరుకి రజత్ పాటిదార్, పంజాబ్‌కు శ్రేయస్ అయ్యర్, కోల్‌కతాకు అజింక్య రహానే సారథులుగా వ్యవహరించనున్నారు. వీరందరూ ఆయా జట్లకు కొత్తగా కెప్టెన్లుగా నియమితులయ్యారు. ఇక మరో 5 ఫ్రాంచైజీ యాజమాన్యలు తమ టీమ్‌లకు పాత కెప్టెన్లనే కొనసాగిస్తున్నాయి. వాటిలో చెన్నై సూపర్ కింగ్స్‌కు రితురాజ్ గైక్వాడ్, ముంబయి ఇండియన్స్‌కు హార్దిక్ పాండ్యా, గుజరాత్ టైటాన్స్‌కు శుభ్‌మాన్ గిల్, రాజస్థాన్ రాయల్స్‌కు సంజు సామ్సన్, సన్ రైజర్స్ హైదరాబాద్‌కు పాట్ కమ్మిన్స్‌లతోనే నడిపించాలని ఫ్రాంచైజీలు నిర్ణయం తీసుకున్నాయి. ఈ సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఏకైక విదేశీ కెప్టెన్‌గా పాట్ కమ్మిన్స్ వ్యవహరిస్తాడు. కెప్టెన్సీ పరంగా పాట్ కమ్మిన్స్ అత్యంత సీనియర్‌గా కనిపిస్తున్నాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో కెప్టెన్‌గా అతనికి చాలా అనుభవం ఉంది. పాట్ కమిన్స్ ప్రస్తుతం గాయంతో బాధపడుతున్నాడు. అతను ఐపీఎల్‌కు ఫిట్‌గా ఉంటాడని ఆ ఫ్రాంచైజీ యాజమాన్యం భావిస్తోంది. చీలమండ గాయంతో బాధపడుతున్న తర్వాత, పాట్ కమ్మిన్స్ ఛాంపియన్స్ ట్రోఫీ వంటి పెద్ద టోర్నమెంట్లలో కూడా ఆడలేకపోయాడు. అయితే, ఇప్పుడు అతని స్థానం బలంగా ఉంది. అతను మరోసారి సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు కెప్టెన్‌గా ఉండటానికి సిద్ధమయ్యాడు.

### మహిళల టి20 సిరీస్‌లో..

# శ్రీలంక తొలి విజయం



**న్యూఢిల్లీ:** మహిళల టీ 20లో శ్రీలంక చేతిలో స్వంతగడ్డ మీద న్యూజిలాండ్ ఘోర పరాజయాన్ని ఎదుర్కొంది. పరిమిత ఓవర్ల సిరీస్ కోసం న్యూజిలాండ్‌లో పర్యటిస్తున్న శ్రీలంక మహిళల జట్టు తొలి ఘన విజయం సాధించింది. మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో భాగంగా జరిగిన తొలి మ్యాచ్‌లో 7 వికెట్ల తేడాతో హ్యాట్రిక్ కొట్టింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ 18.5 ఓవర్లలో 101 పరుగులకే ఆలౌటైంది. లంక బౌలర్లు మల్కి మదారా 3, కవిష దిల్హారి, ఇనోషి ప్రియదర్శిని తలో 2, సుగంధిక కుమారి, చమారీ ఆటపట్టు చెరో వికెట్ తీసి న్యూజిలాండ్ ఇన్నింగ్స్‌ను కుప్పకూల్చారు. న్యూజిలాండ్ ఇన్నింగ్స్‌లో ఎమ్మా మెక్లియోడ్ (44), కెప్టెన్ సూజీ బేట్స్ (21), జెస్ కెర్ (10) మాత్రమే రెండంకెల స్కోర్లు చేశారు. జార్జియా ప్లిమ్మర్ 2, బ్రూక్ హ్యాలిడే 4, ఇజ్జి షార్ప్ 0, మ్యాడీ గ్రీన్ 5, పోల్లి ఇంగ్లిస్ 4, రోస్‌మేరీ 0, ఎడెన్ కార్సన్ 7 పరుగులు చేశారు. లంక బౌలర్లు చెలరేగడంతో న్యూజిలాండ్ బ్యాటర్లు పెవిలియన్‌కు క్యూ కట్టారు. అనంతరం ఓపెనర్ చమారీ ఆటపట్టు (48 బంతుల్లో 64 నాటౌట్) అజేయ అర్ధ సెంచరీతో చెలరేగడంతో శ్రీలంక 14.1 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. నిలాక్షి డిసిల్వతో (12 నాట్) కలిసి ఆటపట్టు లంకను విజయతీరాలకు చేర్చింది. లంక ఇన్నింగ్స్‌లో విష్మి గౌతమ్ 7, హర్షిత సమరవిక్రమ 2, కవిశ దిల్హారి 12 పరుగులు చేసి ఔటయ్యారు. న్యూజిలాండ్ బౌలర్లలో జెస్ కెర్ 2 వికెట్లు పడగొట్టింది. ఈ గెలుపుతో శ్రీలంక మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో 1-0 ఆధిక్యంలోకి వెళ్లింది. ఇక రెండో టీ20 క్రైస్ట్‌చర్చ్ వేదికగా ఈ నెల 16న జరుగనుంది.

### ఇంటర్నేషనల్ మాస్టర్స్ లీగ్‌లో..

# టైటిల్ పోరుకు వెస్టిండీస్

### నేడు భారత్‌తో తుది పోరు

**న్యూఢిల్లీ:** అంతర్జాతీయ మాస్టర్స్ లీగ్-2025లో వెస్టిండీస్ ఫైనల్‌కు దూసుకువచ్చింది. ఆఖరి వరకు ఉత్కంఠగా సాగిన రెండో సెమీ ఫైనల్లో శ్రీలంకను చిత్తు చేసి టైటిల్ పోరుకు అర్హత సాధించింది. రాయ్పూర్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో లంకపై కేవలం 6 పరుగుల స్వల్ప తేడాతో వెస్టిండీస్ గెలిచింది. టాస్ గెలిచిన శ్రీలంక తొలుత బ్యాటింగ్‌కు వెస్టిండీస్‌ను ఆహ్వానించింది. ఈ క్రమంలో నిర్ణీత 20 ఓవర్లలో విండీస్ జట్టు 5 వికెట్ల నష్టానికి 179 పరుగులు చేసింది. ఓపెనర్లలో డ్వేన్ స్మిత్ (0) విఫలం కాగా, విలియం పెర్కిన్స్ (24) ఫర్వాలేదనిపించాడు. వన్‌డౌన్ బ్యాటర్ లెండిల్ సిమ్మన్స్ (12 బంతుల్లో 17) వేగంగా ఆడగా, కెప్టెన్ బ్రియన్ లారా దంచి కొట్టాడు. శ్రీలంక బౌలర్లలో నువాన్ ప్రదీప్, జీవన్ మెండిస్, అసేల గుణరత్నె ఒక్కో వికెట్ దక్కించుకున్నారు. ఇక లక్ష్య ఛేదనలో శ్రీలంక ఓపెనర్లలో ఉపుల్ తరంగ (30) రాణించగా, కెప్టెన్ కుమార్ సంగక్కర (17), వన్డౌన్‌లో వచ్చిన లాహిరు తిరిమన్నె (9) పూర్తిగా నిరాశపరిచారు. ఇలాంటి తరుణంలో అసేల గుణరత్నె ఒంటరి పోరాటం చేశాడు. 42 బంతుల్లో 7 ఫోర్లు, ఒక సిక్స్‌సాయంతో 66 పరుగులు సాధించాడు. అతడికి తోడుగా ఇసురు ఉడానా (10 బంతుల్లో 21), దిల్‌రువాన్ పెరీరా (6 బంతుల్లో 11) రాణించారు. కానీ విండీస్ బౌలర్ల విజృంభణ కారణంగా శ్రీలంక నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లు నష్టపోయి 173 పరుగుల వద్ద నిలిచింది. ఫలితంగా 6 పరుగుల స్వల్ప తేడాతో గెలుపొంది వెస్టిండీస్ ఫైనల్ బెర్తును ఖరారు చేసుకుంది. కాగా ఈ నెల 16వ తేదీన జరిగే టైటిల్ మ్యాచ్‌లో ఇండియాతో వెస్టిండీస్ తలపడనుంది.

# గోల్డ్ బాండ్స్ ఇన్వెస్టర్లకు బంపర్ ఆఫర్..

**న్యూఢిల్లీ, మార్చి 15:** ముందుచూపుతో ఎనిమిదేళ్ల క్రితం సావరిన్ గోల్డ్ బాండ్లను కొనుగోలు చేసినవారికి జాక్‌పాట్. 2016-17 సిరీస్ 4 బాండ్లకు సంబంధించిన రిడెంప్షన్ తేదీని రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా తాజాగా ప్రకటించింది. మార్చి 17న మెచ్యూర్ తేదీగా నిర్ణయించింది. దీంతో అప్పట్లో పెట్టుబడులు పెట్టిన వారు దాదాపు మూడింతలు లాభం పొందనున్నారు. దేశంలో భౌతిక బంగారం కొనుగోళ్లను తగ్గించాలన్న ఉద్దేశంతో 2015 నవంబరులో ఆర్‌బిఐ ఈ పథకం తీసుకొచ్చింది. వీటి కాలపరిమితి 8యేళ్లు. 2017లో మార్చిలో జారీ చేసిన నాలుగో విడత బాండ్లకు మెచ్యూరిటీ ధరను తాజాగా ఆర్‌బిఐ ప్రకటించింది. అప్పట్లో గ్రాము రూ.2,943 చొప్పున బాండ్లు జారీ చేయగా, తాజా ధరను రూ.8,624గా పేర్కొంది. అంటే అప్పట్లో లక్ష రూపాయలు ఇన్వెస్ట్ చేసిన వారికి ఇప్పుడు దాదాపు రూ.3 లక్షలు లభిస్తుంది. దీనికి గోల్డ్ బాండ్లపై ఇచ్చే వడ్డీ అదనం. యేటా 2.50 శాతం నామ మాత్ర వడ్డీని బాండ్ల కొనుగోలుపై ఆర్‌బిఐ చెల్లిస్తుంది. గ్రాము ధర నిర్ణయించేందుకు రిడెంప్షన్‌కు ముందు వారం 999 స్వచ్ఛత కలిగిన బంగారానికి ఇండియా బులియన్ అండ్ జ్యువెల్లర్స్ అసోసియేషన్ లిమిటెడ్ నిర్ణయించిన సగటు ధరను పరిగణనలోకి తీసుకుంటారు. అలా గ్రాముధరకు రూ.8,624గా నిర్ణయించారు. దీంతో పాటు 2019-20 సిరీస్4 కు సంబంధించిన ప్రీ మెచ్యూర్ రిడెంప్షన్ విండోను కూడా మార్చి 17న ఆర్‌బిఐ నిర్ణయించింది. దీనికిగానూ గ్రాము ధరను రూ.8,634గా నిర్ణయించారు. ఇందుకు రిడెంప్షన్‌కు ముందు వారం చివరి మూడు పనిదినాలను పరిగణనలోకి తీసుకుంటారు. అంతర్జాతీయంగా ఔన్సు 3వేల డాలర్లు, దేశీయంగా బంగారం ధర ఆల్‌టైమ్‌గరిష్టాలకు చేరినవేళ సావరిన్‌గోల్డ్‌బాండ్లు రిడెంప్షన్‌కు రావడంతో నిజంగా ఇన్వెస్టర్లకు జాన్‌పాట్ అనే చెప్పాలి.




# ట్రంప్ ప్రభుత్వానికి ఓపెన్ ఎఐ వార్నింగ్

**వాషింగ్టన్, మార్చి 15:** కృత్రిమ మేధ ఆధిపత్యం కోసం ప్రపంచవ్యాప్తంగా పోటీ తీవ్రతరం అవుతున్న తరుణంలో సామ్ ఆల్ట్‌మన్ నేతృత్వంలోని ఓపెన్ ఎఐ అమెరికా ప్రభుత్వానికి హెచ్చరికలు జారీ చేసింది. కాపీరైట్ సంస్కరణల్లో నిబంధనల కారణంగా అమెరికన్ కంపెనీలు చాలా వెనుకబడిపోతాయని, చైనీస్ దెవలపర్లు కాపీరైట్ డేటా వినియోగానికి అపరిమిత అవకాశాలు కనుగొంటున్నారని ఓపెన్‌ఎఐ తెలిపింది. ఈ వ్యత్యాసం ఎఐరేసులో చైనాను ముందుంచేందుకు వీలు కల్పిస్తుందని వాదించింది. ఇటీవల యుఎస్ ట్రేడ్ రిప్రజెంటేటివ్ (యుఎస్‌టిఆర్)కు ఇచ్చిన ప్రకటనలో ఈ మేరకు వివరాలు వెల్లడించింది. 'పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనా (పీఆర్సీ) డెవలపర్లకు కాపీరైట్ డేటా వినియోగానికి అపరిమిత అవకాశం ఉంది. అమెరికా కంపెనీలకు అలాంటి అవకాశం లేకపోతే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పోటీ ముగిసిందనే చెప్పవచ్చు. నిజమైన ఐపీ క్రియేటర్లకు రక్షణల విషయంలో పెద్దగా ప్రయోజనం లేకపోగా, కీలకమైన సాంకేతిక పరిజ్ఞానంపై ఆధిపత్యం కోల్పోయే ప్రమాదం ఉంది. డేటా సంరక్షణ కోసం యునైటెడ్ స్టేట్స్ ప్రస్తుత విధానం కాపీరైట్ కంటెంట్ వినియోగాన్ని పరిమితం చేస్తుంది. అయితే చైనా అటువంటి డేటాను కృత్రిమ మేధ శిక్షణ కోసం స్వేచ్ఛగా ఉపయోగిస్తోంది. ఇది చైనా ఎఐ సంస్థలను నిబంధనలకు విరుద్ధంగా ఈ పోటీలో ముందుంచుతుంది' అని ఓపెన్‌ఎఐ తెలిపింది. ఇటీవల ముగిసిన పబ్లిక్ కామెంట్ పీరియడ్‌లో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎఐ యాక్షన్ ప్లాన్‌పై 'ఫ్రీడమ్- ఫోకస్డ్'కు సంబంధించి ఓపెన్‌ఎఐ సిఫార్సులను అందించింది. ఎఐ పరిశ్రమలో 'నేర్చుకునే స్వేచ్ఛ'ను ప్రోత్సహించడానికి తన కాపీరైట్ వ్యూహాన్ని మార్చడం ద్వారా అమెరికా మరింత ముందంజలో ఉంటుందని తెలిపింది.





# ఇక ఎటిఎంల ద్వారానే పిఎఫ్ విత్‌డ్రా

**న్యూఢిల్లీ, మార్చి 15:** ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఈపీఎఫ్ఓ) చందాదారులు ఇప్పటి దాకా తమ పొదుపులను సంప్రదాయ పద్ధతుల విత్‌డ్రా చేసుకునే వారు. కానీ పెరిగిన టెక్నాలజీ నేపథ్యంలో ఓ ఐదేళ్లుగా ఆన్‌లైన్ ద్వారా బ్యాంకు ఖాతాలకు సొమ్ము జమయ్యే విధంగా విత్‌డ్రా ప్రాసెస్‌ను సవరించారు. అయితే పీఎఫ్ విత్‌డ్రాతో పాటు వివిధ సేవలను వేగంగా అందించేందుకు ఈపీఎఫ్ఓ కీలక చర్యలు తీసుకుంటుంది. కేంద్ర కార్మిక మంత్రి మన్సుఖ్ మాండవీయ ఇటీవల ఈపీఎఫ్ఓ 3.0 వెర్షన్‌ను ప్రకటించారు. ఈపీఎఫ్ఓ 3.0 ద్వారా ఏటీఎంల ద్వారా కూడా నేరుగా పీఎఫ్ ఖాతాల నుంచి నిధుల ఉప సంహారణకు వీలు ఉంటుంది. ఈపీఎఫ్ఓ 3.0లో పీఎఫ్ సంబంధిత సమస్యల పరిష్కారానికి పీఎఫ్ కార్యాలయాల చుట్టూ తిరగే అవకాశం లేకుండా సభ్యుడే నేరుగా ఆన్‌లైన్ ద్వారా సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. అలాగే పీఎఫ్ విత్‌డ్రా కోసం యజమానులపై ఆధారపడకుండా ఎప్పుడైనా ఏటీఎంల నుంచి విత్‌డ్రా చేసుకునే సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకురానున్నారు. ముఖ్యంగా ఐటీ మౌలిక సదుపాయాలను గణనీయంగా అప్‌గ్రేడ్ చేయడం ద్వారా ఈసదుపాయాలు సభ్యులకు అందుబాటులోకి రానున్నాయి. పీఎఫ్ ఉపసంహారణలను సరళీకృతం చేయడం, వాటిని మీ బ్యాంక్ ఖాతా నుంచి నగదు ఉపసంహరించుకున్నంత సులభం పీఎఫ్ విత్‌డ్రా ఫెసిలిటీను సభ్యులకు అందించడమే లక్ష్యంగా ఈ కొత్త అప్‌డేట్స్ అందుబాటులోకి రానున్నాయి. ఈపీఎఫ్ఓ తన పీఎఫ్ ఖాతాలను ఏటీఎం అనుకూల వ్యవస్థతో అనుసంధానించాలని యోచిస్తోంది. అందువల్ల చందాదారులు తమ రిజిస్టర్డ్ యూనివర్సల్ అకౌంట్ నంబర్ (యూఏఎన్) లేదా లింక్డ్ బ్యాంక్ ఖాతాల ద్వారా తమ నిధులను యాక్సెస్ చేసుకోవచ్చు. అయితే విత్ డ్రా సమయంలో మాత్రం రిజిస్టర్డ్ మొబైల్ నంబర్‌కు ఓటీపీ వస్తుంది. ఆ ఓటీపీ ఎంటర్ చేస్తే విత్‌డ్రా చేసుకునే సదుపాయం ఉండనుంది. ఏటీఎం యాక్సెస్‌తో పాటు, ఈపీఎఫ్ఓ యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ద్వారా కూడా పీఎఫ్ క్లెయిమ్‌లను ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటుంది. ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం, భీమ్ వంటి ప్రసిద్ధ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా నేరుగా పీఎఫ్ ఖాతాల నుంచి మన బ్యాంకు ఖాతాలకు నిధులు బదిలీ చేసుకునే సదుపాయం అందుబాటులోకి రానుంది. ఈపీఎఫ్ఓ 3.0 మీకు ఒక ప్రత్యేకమైన పీఎఫ్ విత్‌డ్రా కార్డును అందిస్తుంది. ఇది సాధారణ ఏటీఎం కార్డులా పనిచేస్తుంది.




# భారత్‌కు టెస్లా రెండు మోడళ్లు!.. సర్టిఫికేషన్‌కు దరఖాస్తు

**వాషింగ్టన్, మార్చి 15:** టెస్లా భారతదేశంలో తన కార్ల విక్రయాలను ప్రారంభించడానికి సిద్ధమైంది. ఇప్పటికే దీనికి సంబంధించిన అన్ని సన్నాహాలు చేస్తున్న సంస్థ. తాజాగా భారతదేశంలో రెండు ఎలక్ట్రిక్ కార్ల విక్రయాల కోసం సర్టిఫికేషన్ అండ్ హోమోలోగేషన్ ప్రక్రియను ప్రారంభించింది. దేశంలో కార్లను విక్రయించే ముందు సర్టిఫికేషన్ అండ్ హోమోలోగేషన్ ప్రక్రియ తప్పనిసరి. కాబట్టి టెస్లా ఇండియా మోటార్ అండ్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ భారతదేశంలో 'మోడల్ వై, మోడల్ 3' కార్ల హోమోలోగేషన్ కోసం రెండు దరఖాస్తులను సమర్పించింది. హోమోలోగేషన్ అనేది ఒక వాహనం రహదారికి యోగ్యమైనదని, భారతదేశంలో తయారు చేసిన లేదా దేశంలోకి దిగుమతి చేసుకున్న అన్ని వాహనాలకు నిర్దేశించిన నిబంధనలకు అనుగుణంగా ఉందని ధృవీకరించే ప్రక్రియ. కేంద్రమోటారు వాహన నియమాలకు అనుగుణంగా ఉద్గారం, భద్రత, రహదారి యోగ్యత పరంగా వాహనం భారత మార్కెట్ అసరాలకు సరిపోతుందని సంబంధిత శాఖ నిర్ధారించాలి. ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద కార్ల మార్కెట్ అయిన భారతదేశంలో అమెరికన్ కంపెనీ టెస్లా అడుగుపెట్ట డానికి ప్రయత్నిస్తూనే ఉంది. దీనికి సంబం ధించిన ద్వైపాక్షికఒప్పందాలు కూడా పూర్తయ్యాయి. కాబట్టి త్వరలో టెస్లా కార్లు ఇండియన్ మార్కెట్లో అమ్మకానికి రానున్నాయి. అయితే టెస్లా తయారీ ప్లాంట్ ఇండియాలో ప్రారంభిస్తారా? లేదా? అనే దానికి సంబంధించిన వివరాలు ప్రస్తుతానికి అందుబాటులో లేదు. ప్రస్తుతం అమెరికాలో టెస్లా చౌకైన కారు మోడల్3 ధర ఫ్యాక్టరీ స్థాయిలో దాదాపు 35వేల డాలర్లు. భారతదేశంలో దిగుమతి సుంకాలను 15-20 శాతానికి తగ్గించడంతో పాటు, రోడ్ ట్యాక్స్ అండ్ ఇన్సూరెన్స్ వంటి అదనపు ఖర్చులతో, ఆన్-రోడ్ ధర 40వేల డాలర్లు, దాదాపు రూ.35-40 లక్షలుగా ఉంటుంది. టెస్లా మోడల్ వై ధరలు రూ.70లక్షల నుంచి ప్రారంభమయ్యే అవకాశం ఉంది. భారతదేశంలో ఎలక్ట్రిక్ కార్ల అమ్మకాలు 2023లో 82,688 యూనిట్ల నుంచి 2024లో 20శాతం పెరిగి 99,165 యూనిట్లకు చేరుకున్నాయి. టాటామోటార్స్, జెఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్స్ కంపెనీలు ప్రస్తుతం మార్కెట్ లీడర్లుగా ఉన్నాయి.




# వాణిజ్యం

# రికవరీ దిశగా ఇండస్ ఇండ్ బ్యాంకు: ఆర్‌బిఐ

**ముంబై, మార్చి 15:** ప్రముఖ ప్రైవేట్ రంగ బ్యాంకు ఇండస్ ఇండ్ బ్యాంకు ఆర్థిక పరిస్థితి మెరుగ్గానే ఉందని రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా వెల్లడించింది. బ్యాంకుపై వస్తున్న ఊహాజనిత కథనాలకు డిపాజిటర్లు స్పందించవద్దని సూచించింది. బ్యాంకుకు చెందిన డెరివేటివ్ పోర్ట్‌ఫోలియోలో అవకతవకలు ఉన్నట్లు గుర్తించడంతో స్టాక్ మార్కెట్లలో బ్యాంకింగ్ షేర్లు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొన్న విషయం విదితమే. ఈ నేపథ్యంలో డిపాజిటర్లు ఆందోళనకు గురికాకూడదన్న ఉద్దేశంతో ఈ ప్రకటన విడుదల చేసింది. ప్రైవేట్ రంగ ఇండస్ ఇండ్ బ్యాంకులో దాదాపు రూ.2,100 కోట్ల మేర అకౌంటింగ్ తేడాలు వెలుగు చూశాయి. కరెన్సీ డెరివేటివ్స్‌కు సంబంధించిన అవకతవకలను గత యేడాది సెప్టెంబరు-అక్టోబరులో గుర్తించినా, ఇండస్ ఇండ్ బ్యాంకు ఇప్పుడు బహిర్గతం చేసింది. ఫలితంగా ఇండస్ ఇండ్ బ్యాంకు షేరు భారీగా పతనమైన చిన్న ఇన్వెస్టర్లు, మ్యూచువల్ ఫండ్ సంస్థలకు భారీ నష్టం వాటిల్లింది. ఖాతాల్లో లోపాల కారణంగా మార్చి త్రైమాసికంలో ఇండస్ ఇండ్ బ్యాంకు రూ.1600 కోట్ల నష్టాన్ని చవిచూడొచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత త్రైమాసికంలోనే పరిష్కార చర్యలను పూర్తి చేయాలని ఇండస్ ఇండ్ బ్యాంకు బోర్డుకు ఆర్‌బిఐ తాజాగా ఆదేశాలు జారీ చేసింది.




# మినరల్ టాక్స్ ఎఫెక్ట్..సిమెంట్ ధరలు పైపైకి!

**ముంబై, మార్చి 15:** సిమెంట్ కంపెనీల మధ్య పోటీ కారణంగా గత కొన్ని రోజులుగా స్తబ్దుగా ఉన్న ధరలు, రాబోయే రోజుల్లో ప్రియం అయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు ఖనిజాలపై పన్ను విధించేందుకు సిద్ధమవుతుండడమే దీనికి కారణం. దీంతో సిమెంట్ ధరలకు రెక్కలు రాబోతున్నాయని ఫైనాన్షియల్ సర్వీసెస్ సంస్థ జెఎం ఫైనాన్షియల్స్ పేర్కొంది. ఖనిజాలు, గనులు కలిగిన భూములపై రాయల్టీ విధించే హక్కు రాష్ట్రాలకు ఉందని గతేడాది సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వం సిమెంట్ తయారీలో వినియోగించే సున్నపురాయి మైనింగ్‌పై టన్నుకు రూ.160 చొప్పున వసూలు చేయాలని నిర్ణయించింది. ఈ పన్ను వల్ల సిమెంట్ తయారీ వ్యయం కంపెనీలకు పెరుగుతుంది. దీంతో లాభదాయకత పెంచుకోవాలంటే సిమెంట్ కంపెనీలకు ధరల పెంపు చేపట్టక తప్పని పరిస్థితి నెలకొంటుంది. దీంతో ఒక్కో బ్యాగ్‌పై తమిళనాడులో రూ.8-10 మేర పెరిగే అవకాశం ఉందని కూడా తెలిపింది. ఈ మేర ప్రజలపై భారం పడే అవకాశం ఉందని తెలిపింది. ఒకవేళ మిగిలిన రాష్ట్రాలూ ఇదేతరహా పన్ను తీసుకొస్తే, దేశవ్యాప్తంగా సిమెంట్ ధరలు పెరిగే అవకాశం ఉంది.



Printed and Published by Girish Sangi, CMD And Manging Editor On Behalf Of Aga AGA Publications LTD, MGM Hospital road Warangal , TELANGANA-506002 RIN No ; 64849/96 Editor * Damerla Saibaba, * Responsible for Selection Of News Under the PRB Act. Regd : No.H/SD/337/12-14 postal line liance-L/R NP WGL-8/12-14